# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 355 | శుక్రవారం, 22 ఆగస్టు 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## నాపై కుట్రలు ఆపడం లేదు

కుట్రదారులు ఎవరో చెప్పాలని కోరితే.. నన్నే టార్గెట్ చేశారు!

అమెరికాకు రాగానే పదవి నుంచి తొలిగించారు

సింగరేణి బొగ్గు గని కార్మికులకు ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ

టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్

లేఖను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు

హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):

సింగరేణి బొగ్గు గని కార్మికులకు ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా ..మిగతా 2లో

## 'కాళేశ్వరం' పిటిషన్లపై హైకోర్టు గరం గరం

కాళేశ్వరం కమిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ..

కమిషన్ రిపోర్టును రద్దు చేయాలని కేసీఆర్, హరీష్ రావు పిటిషన్లు..

కేసీఆర్ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్..

కేసీఆర్ కు నోటీసు ఇవ్వకుండా ఆయనకు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చారు: లాయర్



3

## 'ఫీజు రీయింబర్స్‌మెంట్'కు కోత?



నిబంధనల మార్పు దిశగా సర్కారు అడుగులు

50% సబ్జెక్టులు పాసవ్వాలి..

75% హాజరు ఉండాలి

ప్రధాన సబ్జెక్టుల్లో 60% మార్కులు రావాలి

అప్పుడు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఎంతవుతుందో నివేదిక ఇవ్వాలన్న ప్రభుత్వం

ప్రస్తుతం రీయింబర్స్‌మెంట్ కింద ఏటా రూ.2,350 కోట్లు చెల్లింపు

12.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

కొత్త నిబంధనలు వస్తే సగం మందికి కత్తెర?

హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):

రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు షాక్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైంది. దాదాపు సగం మందిపై ప్రభావం చూపించేలా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు సూచించింది. మంగళవారం రాత్రి ఉన్నతాధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇంజనీరింగ్ ఫీజులతో పాటు, రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపైనా చర్చించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.8 కోట్ల మేర పేరుకుపోవడంతో.. పరీక్షల సమయంలో యాజమాన్యాలు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ అంశాలను విద్యా, సంక్షేమ శాఖల అధికారులు సీఎం దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు తీరును మార్చాలని, అర్హతల్లో మార్పులు చేయాలని ఆయన సూచించినట్టు సమాచారం. దీనివల్ల అర్హులైన విద్యార్థుల సంఖ్య ..మిగతా 3లో

### ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజు పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

కళాశాలల్లోని విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఫీజులు నిర్ధారించాలని నిర్ణయం

ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలు ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించాలని నిర్ణయం



3

## మేడిగడ్డను ముంచే కుట్ర..

ఇచ్చంపల్లిని ముందుపెట్టి కాంగ్రెస్ సర్కారు పన్నాగం




మోదీ ప్రసన్నం కోసం గోదావరికావేరీకి గ్రీన్‌సిగ్నల్

ఓవైపు బనకచర్లకు జై.. మరోవైపు ఇచ్చంపల్లికి సై

గోదావరిలో 'మిగులు' వాదనకు నీళ్లొదిలిన సర్కారు

ఇప్పటికే కేంద్రం ముందు రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు

ఇదే జరిగితే అన్నారం, సుందిల్ల బరాజ్‌లూ పడావు

20 నెలలుగా మేడిగడ్డను బాగు చేయకుండా నిర్లక్ష్యం

22న గోదావరికావేరీ లింక్‌పై ఎన్‌డబ్ల్యూడీఏ భేటీ

కేసీఆర్‌పై కక్షతో రేవంత్‌రెడ్డి సర్కారు డేంజర్ గేమ్

హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):

'కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగినయి. దానికి మరమ్మతులు చేస్తే కిందకు పోతున్న ప్రాణహిత జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లు, చెరువులు నింపుకోవచ్చు. యాసంగిలోనూ లక్షల ఎకరాలకు పుష్కలంగా సాగునీళ్లివ్వచ్చు. అందుకే మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయండి.. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి లక్షలాది ఎకరాల ..మిగతా 2లో

## జంపన్న వాగును అభివృద్ధి చేస్తాం..

29 ఎకరాల్లో స్మృతి వనం!

మేడారంకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు

మేడారం జాతరకు వసతులు కల్పిస్తున్నాం

పర్యాటక శాఖతో కలిసి జంపన్న వాగును అభివృద్ధి చేస్తాం

స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం



2

## రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారు



3

తెలంగాణలో యూరియా కొరతకు కేంద్రమే పూర్తి కారణమన్న తుమ్మల

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ కుట్ర అని ఆరోపణ

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదని మండిపాటు

## మా పార్టీ గురించి నీ తండ్రిని అడుగు..

కేటీఆర్ పై మంత్రి కోమటి రెడ్డి ఫైర్

మా పార్టీ గురించి నీ తండ్రిని అడుగు అంటూ

తెలంగాణ ఇచ్చిన పార్టీ నీకు థర్డ్ గ్రేడ్ పార్టీలా కనిపిస్తుందా..



హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):

కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కోమటి రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని దర్టీ పార్టీ అని మాట్లాడడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం.. తెలంగాణ ఇచ్చిన పార్టీ నీకు థర్డ్ గ్రేడ్ పార్టీలా కనిపిస్తుందా..?.. నీ తండ్రిని అడుగు మా పార్టీ గురించి చెప్తాడు.. నీ తండ్రి కేసిఆర్, నువ్వు నీ కుటుంబం ..మిగతా 2లో



3

## గీతన్నకు కాంగ్రెస్ అన్యాయం

మద్యం దుకాణాల్లో 25% రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ

కానీ 15శాతంతోనే సరిపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

గుట్టుచప్పుడు కాకుండా ఎక్సైజ్ పాలసీ నిబంధనల ప్రకటన

ఈ నెల 14న ఉత్తర్వుల వెల్లడి వారం రోజులపాటు గోప్యత

## సినీ కార్మికుల సమ్మెకు శుభం కార్డు...

గత 18 రోజులుగా కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మెకు తెర

కార్మికుల వేతనాలు 22.5 శాతం పెంచేందుకు నిర్మాతల అంగీకారం

సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఫలించిన చర్చలు

రేపటి నుంచి యథావిధిగా సినిమా షూటింగులు

మూడేళ్లలో దశలవారీగా వేతనాల పెంపు ఒప్పందం

30 శాతం పెంపు డిమాండ్ చేయగా, 22.5 శాతానికి ఇరువర్గాల అంగీకారం



3

## 'స్కాంగ్రెస్' దోపిడీని ఎండగడుతాం

గండిపేటకు గోదావరి నీళ్లు తెచ్చేందుకు బీఆర్ఎస్ కృషి

2022లోనే రూ.1,100 కోట్లతో ప్రతిపాదన పెట్టాం

మేము అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ దోపిడీకి తెరలేపింది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

# నాపై కుట్రలు ఆపడం లేదు



మొదటిపేజీ తరువాయి

పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు. సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే తనపై కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు అని, తన తండ్రి కేసీఆర్‌కి రాసిన లేఖను తాను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారని స్పష్టం చేశారు. పార్టీలో కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. తనపైనే కక్ష కట్టారంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న సింగరేణి బొగ్గు గని కార్మికులకు మీ కల్వకుంట్ల కవిత నమస్కరించి వ్రాయునది. అన్నాదమ్ములు, అక్కచెల్లెళ్లెరా.. అంటూ బహిరంగ లేఖ మొదలు పెట్టారు. 'టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా పదేళ్ల పాటు మీకు సేవ చేసుకునే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పదేళ్లకాలంలో టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా ప్రతి కార్మిక కుటుంబంలో ఒక సోదరిగా మీకు సేవలందించాను. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ కొప్పుల ఈశ్వర్ గారికి శుభాకాంక్షలు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ ఆఫీసులో ఈ ఎన్నిక నిర్వహించడం సాంకేతికంగా తప్పా ఒప్పా అనే అంశాలను పక్కన పెడితే.. రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగినట్టుగా తెలుస్తోన్నది' అని కవిత రాసుకొచ్చారు.

'తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా సింగరేణి బొగ్గు గని కార్మికులను ఏకతాటిపైకి తెచ్చి పోరాటంలో భాగస్వామ్యం చేసేందుకు నేను మొదటి నుంచి ముందు వరుసలో ఉండి పని చేశాను. 2015 ఆగస్టు 17వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించిన టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో 11 ఏరియాల నుంచి హాజరైన 1000 మందికి పైగా సభ్యుల సమక్షంలో నన్ను గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అప్పటి టీబీజీకేఎస్ అధ్యక్షుడు కనకరాజు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు రవీందర్ రెడ్డితో పాటు సీనియర్ నాయకుడు కెంగెర్ల మల్లయ్య సహా అందరు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. టీబీజీకేఎస్‌లో జరిగే అన్ని నిర్ణయాలను గౌరవ అధ్యక్షురాలి హోదాలో నేనే తీసుకునేలా తీర్మానం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నేను పోరాడుతుంటే.. కొందరు నాపై కుట్రలు పన్నుతున్నారు. అలాంటి కుట్రలతో వ్యక్తిగతంగా నాకు వచ్చే నష్టం ఏమీ లేకపోయినా.. కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్న నన్ను తొలగించి వారి ఐక్యతను దెబ్బతీయడమే కొందరి లక్ష్యంగా కనిపిస్తున్నది' అని ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ పేర్కొన్నారు.

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చే పద్ధతిని పక్కన పెడితే గౌరవ కేసీఆర్ గారిని ఒప్పించి తిరిగి డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించేలా చేశాను. తద్వారా సింగరేణిలో 19,463 మంది యువతకు ఉద్యోగాలు ఇప్పించానని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. సకల జనుల సమ్మెతో సింగరేణిలో తట్టాచెమ్మాస్ బంద్ పెట్టి స్వరాష్ట్ర సాధన ఆకాంక్షను ఢిల్లీకి తెలియజేసేలా కృషి చేసిన మన కార్మికులకు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తెలంగాణ ఇంక్రిమెంట్ ఇప్పించాను. కార్మికులు తీసుకునే రూ.10 లక్షలకు పైబడిన హౌసింగ్ లోన్ పై వడ్డీ చెల్లింపు, కార్మికులు నివసించే క్వార్టర్స్ కు ఉచిత కరెంట్, ఉచిత ఏసీ సదుపాయం ఇప్పించాను. కార్మికులకు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ పది రెట్లు పెంచేందుకు పాటు పడినాను. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన కార్మిక కుటుంబాల్లోని పిల్లలకు ఫీ రీయింబర్స్ మెంట్ సదుపాయం తీసుకువచ్చాను. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి జయంతి రోజున పూర్తి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయించాను. సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు ఆప్షనల్ సెలవు మంజూరు చేయించాను. కార్మిక కుటుంబానికి మాత్రమే పరిమితమైన కార్పొరేట్ వైద్యాన్ని వారి తల్లిదండ్రులకు కల్పింపజేశాను. క్యాడర్ స్కీం, మరణించిన లేదా మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మిక కుటుంబాల్లోని వారసులు మేజర్ అయ్యేంత వరకు ఎంఎంసీ సదుపాయం కల్పించడం సహా కార్మిక కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఎన్నో పథకాలు అమలు చేయడంలో క్రియాశీలంగా పని చేశాను' అని రాశారు.

'భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో కొన్నాళ్లుగా జరుగుతోన్న పరిణామాలు మీకందరికి తెలిసే ఉంటుందని భావిస్తున్నాను. పార్టీ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ గారి ప్రసంగంపై వివిధ వర్గాల ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను నేను లేఖ రూపంలో తెలియజేశాను. నా తండ్రిగారైన కేసీఆర్ గారికి నేను గతంలోనూ ఇలాంటివి ఎన్నో లేఖలు రాశాను. నేను గతంలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు కేసీఆర్ గారికి రాసిన ఆ లేఖను లీక్ చేశారు. ఆ లేఖను లీక్ చేసి నాపై కుట్రలకు పాల్పడుతున్న వారు ఎవరో బయట పెట్టాలని నేను కోరాను. పార్టీలో జరుగుతోన్న వ్యవహారాలను నేను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా నాపై కక్షగట్టారు. ఆ తర్వాత జరుగుతోన్న పరిణామాలు, ఘటనలు అన్ని మీ మననంలో ఉన్నాయనే అనుకుంటున్నాను. ఆడబిడ్డగా పార్టీ మంచి కోరి రాసిన లేఖను లీక్ చేసిన కుట్రదారులు ఎవరో చెప్పాలని కోరితే నాపైనే కక్షగట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో కార్మిక చట్టాలకు విరుద్ధంగా టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి కొత్త గౌరవ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్టుగా ప్రకటించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలి పదవిలో ఉన్నా లేకున్నా ప్రతి కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా ఎళ్లవేళలా నేను మీ వెన్నంటే ఉంటాను. గడిచిన దశాబ్ద కాలంగా సంఘం గౌరవ అధ్యక్షురాలిగా, అంతకుముందు ఉద్యమ నాయకురాలిగా ఎలాంటి సేవలందించానో ఇకపైనా కార్మికుల కోసం అలాగే పని చేస్తాను. కార్మికులకు ఏ చిన్న కష్టం వచ్చినా మీకు అండదండగా ఉంటానని మాట ఇస్తున్నాను'ఆ ని ఎమ్మెల్సీ కవిత లేఖ రాసుకొచ్చారు.

# మేడిగడ్డను ముంచే కుట్ర..

మొదటిపేజీ తరువాయి

పంటలను కాపాడండి' అని ఏడాదిన్నరగా బీఆర్ఎస్‌తో పాటు లక్షలాది మంది రైతులు డిమాండ్ చేస్తున్నరు. తాజాగా రేవంత్ సర్కారు ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి కూడా మేడిగడ్డను రిపేరు చేసి వాడుకోవాల్సిందేనని కుండబద్దలు కొట్టారు.

అసలు బరాజ్ ఉంటేనే కదా ఈ గోల. దాన్నే లేకుండా చేస్తే?! రిపేర్లు ఉండవు! డిమాండ్లు అసలే ఉండవు! మేడిగడ్డను రిపేరు చేస్తే రైతులకు సాగునీరు అంది కేసీఆర్‌కే పేరొస్తది! మరి నాకేంది?! అనుకుంటున్నట్టున్నది రేవంత్ సర్కారు! అందుకే చెట్టును కూకటి వేళ్లతో పీకేసేందుకే నిర్ణయించింది. నిన్నటికి నిన్న ఢిల్లీలో బనకచర్లపై సంతకం చేసి వచ్చిన రేవంత్‌రెడ్డి అదే సమయంలో కేంద్రానికి కూడా ఒక బంపర్ ఆఫర్ ఇచ్చి వచ్చారు. తెలంగాణ రైతులు ఎటన్నపోనీ.. ఇచ్చంపల్లి దగ్గర డ్యామ్ కట్టి ప్రాణహిత, ఇంద్రావతి జలాలను తమిళనాడులోని కావేరీకి తరలించుకుపోయేందుకు ఏకంగా గోదావరికావేరీ అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదన ఇచ్చారు. కింద చంద్రబాబు బనకచర్లతో నీళ్లు మళ్లించుకుంటే, పైన ఇచ్చంపల్లి నుంచి కేంద్రం తమిళనాడుకు జలాలను తన్నుకుపోతుందన్నమాట.

ఇంతకీ.. తెలంగాణకు ఒరిగే ప్రయోజనమేమున్నది? అంటే ఏమీ లేదు.. కాకపోతే కేసీఆర్ మీద కక్షతో రేవంత్ సర్కారు ఆడుతున్న డేంజర్ గేమ్ ఇది! ఇదే అదునుగా ఓవైపు చంద్రబాబు బనకచర్లపై వేగంగా పావులు కదుపుతుంటే మరోవైపు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గోదావరికావేరీ అనుసంధాన ప్రాజెక్టుపై రేపు హైదరాబాద్ జలసౌధలో కన్సల్టెన్సీ సమావేశాన్ని నిర్వహిస్తున్నది. ఇక ఇచ్చంపల్లి డ్యామ్ పూర్తయితే తెలంగాణను కోటి ఎకరాల మాగాణం చేసేందుకు కట్టిన మేడిగడ్డ బరాజ్ గోదావరి జలాల్లో మునిగిపోనున్నది. తద్వారా ఎగువన ఉన్న అన్నారం, సుందిల్ల బరాజ్‌లు సైతం కాలగర్భంలో కలిసిపోనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.. భారతదేశం.. ఇక్కడే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేక సాగునీటి ప్రాజెక్టుల్లో లోపాలు తలెత్తాయి. తదుపరి వాటికి మరమ్మతులు చేస్తే ఆ ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి రైతులకు సేవలందిస్తున్నాయి.

కానీ ఒక ప్రాజెక్టులో చిన్న లోపం తలెత్తితే రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా కాలయాపన చేయడమంటే ఆ ప్రాజెక్టును వినియోగించే ఉద్దేశం లేదనేది బహిరంగ రహస్యం. అందుకే గత 20 నెలలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా లక్షలాది మంది రైతులను గోస పెడుతున్నది. దీంతో గత రెండు యాసంగి సీజన్లలో సాగునీరు అందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. దిగుబడి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది కూడా శ్రీరాంసాగర్‌కు మొన్నటిదాకా సరైన ఇన్‌ఫ్లో లేక ఏకంగా ఏడున్నర లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదు. కానీ కండ్ల ముందే వందల టీఎంసీల ప్రాణహిత జలాలు దిగువకు పారుతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు.

**ఎన్డీఎస్‌ఏ సాకుతో కాలయాపన**

కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగుబాటును అడ్డం పెట్టుకొని గత 20 నెలలుగా రేవంత్ సర్కారు ప్రాణహిత జలాలను ఎత్తిపోయడం లేదు. 2024 వేసవిలోనే బరాజ్ మరమ్మతులు చేపట్టాలనే డిమాండ్ రావడంతో ప్రభుత్వం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నివేదికను సాకుగా చూపింది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనేకసార్లు తాము ఎన్డీఎస్‌ఏ చెప్పినట్టుగానే వింటామని, తుది నివేదిక వచ్చిన తర్వాతే మరమ్మతులు చేపడతామని ప్రకటించారు.

తీరా ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక రావడం, అదో డొల్ల నివేదిక కావడంతో ఏం చేయాలో ప్రభుత్వానికే పాలుపోవడం లేదు. అనంతరం సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ పాండ్యా నేతృత్వంలో కమిటీ వేసినట్టు ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఆ కమిటీ ఒక్కసారి కూడా భేటీ అయిన దాఖలాల్లేవు. తదుపరి ఘోష్ నివేదిక అంటూ రాద్ధాంతం చేసిన ప్రభుత్వం ఆ నివేదిక వచ్చిన తర్వాత రాజకీయ విమర్శలకే మొగ్గు చూపుతున్నది తప్ప బరాజ్ పునరుద్ధరణపై దృష్టిసారించడం లేదు.

**బరాజ్‌ను గోదాట్లో కలిపేందుకే..**


గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయా? లేదా? అనేది శాస్త్రీయంగా తేలలేదు. రేవంత్ ప్రభుత్వ వాదన కూడా నిన్నటిదాకా ఇదే ఉన్నది. కానీ కొన్నిరోజులుగా ప్రభుత్వ వాదన మరోలా తయారైంది. బనకచర్ల ఎపిసోడ్ తెర మీదకు వచ్చిన తర్వాత కేంద్ర జల్‌శక్తి మంత్రిని కలిసి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చంపల్లి ప్రతిపాదనను కేంద్రం ముందు ఉంచారు. ఇచ్చంపల్లి దగ్గర డ్యామ్ నిర్మాణం చేపట్టి తమిళనాడులోని కావేరీకి అనుసంధానం చేసి గోదావరి జలాలను తరలించుకుపోయేందుకు తాము అంగీకరిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు.

దీంతో ఇన్నాళ్లూ గోదావరికావేరీ అనుసంధానంపై అయోమయంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఒక్కసారిగా తన దూకుడు పెంచింది. వాస్తవానికి గోదావరిలో మిగులు జలాలను తేల్చిన తర్వాత కావేరీకి నీళ్లు తీసుకుపోవాలంటూ అడ్డు చెప్పాల్సిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చంపల్లి కోసం తహతహలాడటం వెనక మేడిగడ్డ బరాజ్‌ను కాలగర్భంలో కలపాలనే భారీ కుట్రనే ఉన్నదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**ఇచ్చంపల్లితో మేడిగడ్డ ఖతం**

ప్రస్తుతం ప్రాణహిత గోదావరిలో కలిసిన తర్వాత నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బరాజ్‌ను నిర్మించారు. దాని దిగువన దేవాదుల ప్రాజెక్టు కోసం కేసీఆర్ ప్రభుత్వమే తుపాకులగూడెం వద్ద బరాజ్ నిర్మించింది. ఇప్పుడు కేంద్రం కావేరీకి గోదావరి జలాలను తరలించుకుపోయేందుకు ఈ రెండు బరాజ్‌ల మధ్యలో ఇచ్చంపల్లి దగ్గర డ్యామ్ నిర్మిస్తానంటుంది.

అక్కడి నుంచి 174 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుపోయేందుకు గతంలోనే డిటెయిల్డ్ ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కూడా రాష్ట్రాలకు పంపింది. అయితే ఇక్కడ తమిళనాడులో రాజకీయ ప్రయోజనాల కోసం గోదావరి జలాలను తన్నుకుపోవాలనేది మోదీ సర్కారు వ్యూహమైతే.. దీని వల్ల మేడిగడ్డ బరాజ్‌ను శాశ్వతంగా ముంచాలనేది రేవంత్ ప్రభుత్వం కుట్ర! అదెలాగో సాంకేతికంగా మీరే చూడండి..




గోదావరిపై ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ బరాజ్‌ను వంద మీటర్ల ఎత్తులో (ఎఫ్ఆర్ఎల్) నిర్మించారు. దీని బెడ్ లెవల్ (నదిలోని భూ ఉపరితలం) సుమారు 80 మీటర్లు.

గోదావరిలో ప్రాణహిత, ఆపై ఇంద్రావతి కలిసిన పాయింట్‌కు దిగువన 12 కిలోమీటర్ల ప్రాంతంలో ఇచ్చంపల్లి ఉంటుంది. గోదావరికావేరీ అనుసంధానంలో భాగంగా ఇక్కడ ఎన్‌డబ్ల్యూడీఏ 87 మీటర్ల ఎత్తులో (ఎఫ్ఆర్ఎల్) డ్యామ్ నిర్మిస్తామని చెప్తున్నది. దీని బెడ్ లెవల్ సుమారు 72.5 మీటర్లు.

ఇచ్చంపల్లికి దిగువన దేవాదుల ఇన్‌టేక్ పాయింట్ (71 మీటర్లు) ఉంటుంది. దాని దిగువన సమ్మక్క (తుపాకులగూడెం) బరాజ్ ఉంటుంది. సమ్మక్క బరాజ్ ఎఫ్ఆర్ఎల్ 83 మీటర్లు. బెడ్ లెవల్ సుమారు 63 మీటర్లు. దీని ప్రకారం మేడిగడ్డసమ్మక్క బరాజ్ మధ్య ఇచ్చంపల్లి వద్ద డ్యామ్ నిర్మాణం వల్ల దిగువన ఉన్న సమ్మక్క బరాజ్ ఎఫ్ఆర్ఎల్ 83 మీటర్లుగా ఉన్నందున ఇచ్చంపల్లి డ్యామ్ డౌన్ స్ట్రీం ముంపునకు గురవుతుంది. అదేరీతిన ఇచ్చంపల్లి డ్యామ్ ఎఫ్ఆర్ఎల్ 87 మీటర్లుగా ఉంటున్నందున మేడిగడ్డ బరాజ్ డౌన్‌స్ట్రీం ముంపునకు గురవుతుంది. అంటే డ్యామ్‌లో ఉన్న నీటి నిల్వ మేడిగడ్డ బరాజ్ వరకు ఉండి అందులో నిత్యం బరాజ్ నీటిలోనే ఉండిపోతుంది. మేడిగడ్డ బరాజ్ డిజైన్ అనేది ఫ్లోటింగ్ ఫౌండేషన్ అని స్వయానా ఎన్డీఎస్‌ఏనే తేల్చిన దరిమిలా బరాజ్ పునాది నిత్యం నీటిలో ఉండటమంటే ఆ నిర్మాణం గోదావరి పాలు కావడమేనని నిపుణులు చెప్తున్నారు.

**ఎజెండాలోనే తేల్చిన ఎన్‌డబ్ల్యూడీఏ**

ఇచ్చంపల్లి డ్యామ్ నిర్మాణంతో మేడిగడ్డ బరాజ్ శాశ్వతంగా నీటిపాలవుతుందనే నిపుణుల ఆందోళనను స్వయానా ఎన్‌డబ్ల్యూడీఏనే ధ్రువీకరించింది. వాస్తవానికి నదుల అనుసంధానంలో ఇచ్చంపల్లి ప్రతిపాదన తెరపైకి వచ్చినపుడు గోదావరిపై మేడిగడ్డ, సమ్మక్క బరాజ్‌ల నిర్మాణం జరగలేదు. కానీ ఇప్పుడు అవి ఉన్నాయి. ఈ క్రమంలో కనీసం తాజా క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేయకుండా ఎన్‌డబ్ల్యూడీఏ ఎడాపెడా ప్రతిపాదనలు రూపొందించింది.

దానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మద్దతు తెలపడంతో మేడిగడ్డను కాలగర్భంలో కలిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎన్‌డబ్ల్యూడీఏ టాస్క్‌ఫోర్స్ 19వ సర్వసభ్య సమావేశానికిగాను రూపొందించిన ఎజెండాలో ఇదే విషయాన్ని పొందుపరిచారు. రెండు పిల్లర్లు కుంగిపోయిన మేడిగడ్డ బరాజ్ ఎలాగూ వినియోగంలోకి రానందున ఇచ్చంపల్లి డ్యాం నిర్మించి, ఇచ్చంపల్లి ప్రాజెక్టు నుంచి మేడిగడ్డ ద్వారా పొందే ప్రయోజనాలను పొందాలని సూచించారంటే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే మేడిగడ్డను కాలగర్భంలో కలిపేస్తున్నాయనేది సుస్పష్టం.

**గోదావరిలో మిగులు తేలిందా?!**

గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయా? నదుల అనుసంధానాన్ని భుజాన వేసుకున్న ఎన్‌డబ్ల్యూడీఏ (నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) దగ్గర ఈ క్షణం వరకు మిగులుజలాలపై శాస్త్రీయ లెక్కలు లేవు. అటు బనకచర్ల, ఇటు ఇచ్చంపల్లి ప్రతిపాదనలు వచ్చినప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లేవనెత్తాల్సిన కీలకమైన ప్రశ్న ఇది. కానీ అవేవీ చేయకుండా రెండు ప్రాజెక్టులకు సానుకూలంగా స్పందిస్తుండటంతో తెలంగాణ సాగు రంగానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ముఖ్యంగా ఇప్పటికే గోదావరిలో బాబ్లీ కుంపటి సెగను తెలంగాణ అనుభవిస్తున్నది.

ఉమ్మడి ఏపీ లో నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై మహారాష్ట్రతో ఒప్పందంలో గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల మహారాష్ట్ర శ్రీరాంసాగర్ ఎఫ్ఆర్ఎల్ పరిధిలోనే బాబ్లీ ప్రాజెక్టు ను నిర్మించడంతో మహారాష్ట్ర దయ తలిస్తే దిగువకు వరద వచ్చే పరిస్థితి ఏర్పడింది. చివరకు సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే... ప్రతియేటా జూన్ ఒకటో తేదీన బాబ్లీ గేట్లు తెరిచి, అక్టోబర్ 29న మూసేస్తున్నారు. ఆలోపు వచ్చే వరద మాత్రమే తెలంగాణకు దక్కుతుంది. ఇదేరీతిన ఇచ్చంపల్లి దగ్గర జాతీయ ప్రాజెక్టు అయిన గోదావరికావేరీ లింక్ ప్రాజెక్టును నిర్మిస్తే బేసిన్‌తో ఎలాంటి సంబంధం లేని తమిళనాడు గోదావరిలో భాగస్వామ్యం అవుతుంది.

తాగునీరు, కరువు అంటూ మెలిక పెట్టి ఆ రాష్ట్రం భవిష్యత్తులో న్యాయస్థానాలను ఆశ్రయిస్తే.. ఇచ్చంపల్లి ప్రాజెక్టు తెలంగాణకు మరో బాబ్లీలా తయారవుతుంది. ఓవైపు మేడిగడ్డ గోదావరిపాలై నీటిని ఎత్తిపోసుకునే పరిస్థితి ఉండదు. వరద వచ్చే రోజులు మినహా సాధారణ ఇన్‌ఫ్లో ఉండే సమయంలో దిగువకు చుక్క నీరు కూడా వెళ్లకుండా తమిళనాడు న్యాయస్థానాల నుంచి భరోసా పొందితే దిగువన ఉన్న తెలంగాణలోని దేవాదుల, సీతారామ, దుమ్ముగూడెం ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి? అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 'స్కాంగ్రెస్' దోపిడీని ఎండగడుతాం

- గండిపేటకు గోదావరి నీళ్లు తెచ్చేందుకు బీఆర్ఎస్ కృషి
- 2022లోనే రూ.1,100 కోట్లతో ప్రతిపాదన పెట్టాం
- మేము అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ దోపిడీకి తెరలేపింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం): గోదావరి జలాలతో మూసీ నదిని 365 రోజులు పారిస్తామని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా గోదావరి నీళ్లను హైదరాబాద్‌కి దగ్గరలోని కొండ పోచమ్మ సాగర్‌కి తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వం అని కేటీఆర్ గుర్తు చేశారు. కొండ పోచమ్మ సాగర్ నుండి గండిపేట చెరువుకి గోదావరి నీళ్లను తేవడానికి 2022 లోనే రూ.1,100 కోట్లతో ప్రతిపాదనకు ఆమోదం ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. మూసీ నదికి చేరే 2000 ఎంఎల్‌డీ మురికి నీటిని శుద్ధి చెయ్యడం కోసం మొత్తం 36 ఎస్టీపీల నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. మూసీలో ఐదు కిలోమీటర్ల మేర నాగోల్ ప్రాంతంలో సుందరీకరణ చేసింది, మూసీ నది ఒడ్డున ఉప్పల్ భాగాయత్‌లో శిల్పా రామం ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. మొత్తం రంగమంతా కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి, రూ.16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డీపీఆర్ తయారు చేస్తే స్కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టిమేట్స్‌ని రూ. 1,50,000 కోట్లకు పెంచి తెరలేపిన మహా దోపిడీని ముమ్మాటికీ ఎండగడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. మీరు చెయ్యబోతున్న ప్రజా ధనం దోపిడీని ఖచ్చితంగా అడ్డుకుంటాం. ఢిల్లీకి మూటలు పంపుతూ పదవిని కాపాడుకోవడానికే మీరు పడుతున్న తాపత్రయం, దానికి నగర అభివృద్ధి అనే అందమైన ముసుగు అన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఒక వైపు నోరు తెరిస్తే కాళేశ్వరం కూలిపోయింది అని పచ్చి అబద్ధాలు చెబుతూ మరోవైపు అదే కాళేశ్వరంలో అంతర్భాగం అయిన కొండపోచమ్మ సాగర్ నుండి గోదావరి నీటిని తీసుకుంటాం అని చెప్పడం కూడా విజ్ఞులైన తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు.



# మా పార్టీ గురించి నీ తండ్రిని అడుగు..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ దగ్గర గ్రూప్ ఫోటో దిగింది మర్చిపోయారా..? మా పార్టీ పెట్టిన ఉప రాష్ట్రపతి అభ్యర్థిని దేశం మొత్తం హర్షిస్తుంది.. సుదర్శన్ రెడ్డి సుప్రీం కోర్టు జడ్జిగా ఉంటూనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం గళం ఎత్తిన న్యాయకోవిదుడు.

తెలంగాణ బిడ్డ ఉప రాష్ట్రపతి అవ్వడం మీకు ఇష్టం లేదు.. మీ తెలంగాణ వాదం పై సందేహాలు తలెత్తుతున్నాయి.. తెలంగాణ బిడ్డను వ్యతిరేకించిన మిమ్మల్ని తెలంగాణ ప్రజలు క్షమించరు.. లక్షల కోట్ల అవినీతి చేసి ఆ డబ్బుతో కళ్ళు నెత్తికెక్కి కాంగ్రెస్ పై మాట్లాడుతున్నావ్.. అహంకారపూరితమైన మాటలు ఇక మాట్లాడకు.. దేశం కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం పై చులకనగా మాట్లాడడం..అమెరికాలో చదివిన నీ చదువు విజ్ఞతకు వదిలేస్తున్న.. నాడు ప్రపంచలోనే ద బెస్ట్ పిఎం అనిపించుకున్నారు రాజీవ్ గాంధీ.. రాజకీయంతో సంబంధం లేకుండా దేశ ఐక్యత కోసం భారత్ జోడో యాత్ర చేశారు రాహుల్ గాంధీ.. యూరియా ఎందుకు రావట్లేదో నీకు అంత మాత్రం తెలియదా?

కేంద్రం ఇవ్వాల్సింది ఇవ్వకుండా చేస్తుంటే నువ్వు అది మాట్లాడక పోగా.. అజ్ఞానంతో మాట్లాడుతున్నావ్.. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఇస్తే దానిపై క్యాబినెట్ లో చర్చించాం.. అవినీతి చేయకుంటే ఢిల్లీ నుండి లాయర్లను తెప్పించి హైకోర్టుకు ఎందుకు వెళ్లారు.. మీ అవినీతి ప్రజల ముందు పెడతాం.. మీకు ఏ శిక్ష వేయాలో ప్రజలే నిర్ణయిస్తారు.. జగదీష్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయికి నేను దిగజారలేదు.. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఒక్కనాడు మహాత్మ గాంధీ యూనివర్సిటీ కి పోలేదు..నేను ఇప్పుడు లా, ఫార్మసీ కోర్సులు కొత్తగా తెచ్చాను.. YTPS మీద విచారణ జరుగుతుంది. ఆయనకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తేలుస్తాం.. ఉత్తంకుమార్ రెడ్డి గురించి, నా గురించి మాట్లాడేంత స్థాయా మీది.. నల్గొండకు ఏం చేశామో ప్రజలకు తెలుసు.. త్వరలోనే నీ బాగోతం బయటపడుతుంది అంటూ ఫైర్ అయ్యారు.



# జంపన్న వాగును అభివృద్ధి చేస్తాం..

- 29 ఎకరాల్లో స్మృతి వనం!
- మేడారంకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు
- మేడారం జాతరకు వసతులు కల్పిస్తున్నాం
- పర్యాటక శాఖతో కలిసి జంపన్న వాగును అభివృద్ధి చేస్తాం
- స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం

హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం): సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మేడారం 'సమ్మక్క సారలమ్మ' జాతరకు వసతులు కల్పిస్తున్నాం అని తెలంగాణ మహిళ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారంకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. జంపన్న వాగును పర్యాటక శాఖతో కలిసి అభివృద్ధి చేస్తాం అని, స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం అని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది మేడారంలో జరిగే జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసింది.

మేడారం సమ్మక్కసారలమ్మ జాతర జనవరి 28 నుంచి 31 వరకు జరుగుతుంది. మేడారం జాతర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు రిలీజ్ చేసింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఏషియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర మేడారంలో జరుగుతుంది. జాతర ముందస్తు పనుల కోసం సీఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించారు. జంపన్న వాగు నుంచి ఊరి వరకు డివైడర్లతో డబుల్ రోడ్ వేస్తున్నాం. 29 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాము' అని మంత్రి సీతక్క చెప్పారు.





# సినీ కార్మికుల సమ్మెకు శుభం కార్డు...

- గత 18 రోజులుగా కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మెకు తెర
- కార్మికుల వేతనాలు 22.5 శాతం పెంచేందుకు నిర్మాతల అంగీకారం
- సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఫలించిన చర్చలు
- రేపటి నుంచి యథావిధిగా సినిమా షూటింగులు
- మూడేళ్లలో దశలవారీగా వేతనాల పెంపు ఒప్పందం
- 30 శాతం పెంపు డిమాండ్ చేయగా, 22.5 శాతానికి ఇరువర్గాల అంగీకారం

**హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):**

గత 18 రోజులుగా తెలుగు సినీ పరిశ్రమను స్తంభింపజేసిన కార్మికుల సమ్మెకు తెరపడింది. కార్మికుల వేతనాలను 22.5 శాతం పెంచేందుకు నిర్మాతలు అంగీకరించడంతో ఈ ప్రతిష్టంభన వీడింది. తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో, శుక్రవారం నుంచి సినిమా షూటింగులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

వేతనాల పెంపు కోసం సినీ కార్మికులు సమ్మెకు దిగడంతో టాలీవుడ్‌లో చిత్రీకరణలన్నీ నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి చేసిన సూచన మేరకు ఫిల్మ్ ఛాంబర్, ఎఫ్‌డీసీ, కార్మిక శాఖ రంగంలోకి దిగాయి. నిర్మాతలు, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకుల మధ్య జరిగిన త్రైపాక్షిక చర్చలు ఫలించాయి. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, ఇరు పక్షాలు ఒకరి సమస్యలను ఒకరు అర్థం చేసుకున్నాయని, సమస్య పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఒప్పందం వివరాలను కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ వెల్లడించారు. కార్మికులు 30 శాతం వేతన పెంపు డిమాండ్ చేయగా, సుదీర్ఘ చర్చల తర్వాత 22.5 శాతం పెంపునకు ఇరువర్గాలు అంగీకరించాయని ఆయన వివరించారు. ఈ పెంపు మూడేళ్లలో దశలవారీగా అమలు కానుంది. రూ.2 వేల లోపు వేతనం ఉన్నవారికి మొదటి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 2.5 శాతం, మూడో ఏడాది 5 శాతం చొప్పున పెంపు ఉంటుంది. అదేవిధంగా, రూ.2 వేల నుంచి రూ.5 వేల మధ్య వేతనం ఉన్నవారికి మొదటి ఏడాది 7.5 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం చొప్పున వేతనాలు పెరగనున్నాయి.

ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తున్నామని, శుక్రవారం నుంచి కార్మికులందరూ విధులకు హాజరవుతారని ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు ప్రకటించారు. పరిశ్రమ అభివృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని, ముఖ్యమంత్రికి వారు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. తాజా ఒప్పందంతో టాలీవుడ్‌లో మళ్లీ సినిమా చిత్రీకరణలు ఊపందుకోనున్నాయి.

# రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారు

- తెలంగాణలో యూరియా కొరతకు కేంద్రమే పూర్తి కారణమన్న తుమ్మల
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ కుట్ర అని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదని మండిపాటు



**హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):**

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు యూరియా సంక్షోభాన్ని సృష్టిస్తోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణకు యూరియా కేటాయింపుల విషయంలో కేంద్రం తీవ్ర వివక్ష చూపుతోందని తుమ్మల విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై గత కొన్ని నెలలుగా కేంద్రానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్య తీవ్రతను వివరించేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరితే, ప్రధానమంత్రి మోదీ అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా యూరియా ఉత్పత్తి నిలిచిపోయిందని, తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర బీజేపీ నేతలపైనా తుమ్మల తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని అన్నారు. "బాధ్యతగల పదవిలో ఉన్న రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారు. ఇలాంటి మూర్ఖపు మాటల వల్ల బీజేపీ ఎప్పటికీ బలపడదు" అని హితవు పలికారు. రైతులను అడ్డుపెట్టుకుని కొందరు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, చచ్చిన పార్టీకి ప్రాణం పోయాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఈ నెలాఖరులోగా రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను వెంటనే విడుదల చేయాలని తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా సమస్యను కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని, ఇలాంటి వారి పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై బీజేపీ పాదయాత్ర.

- కడుకుంట్ల, పెద్దగూడెం రహదారి పనులు పూర్తి చేయాలి.
- బిజెపి జిల్లా అధ్యక్షులు నారాయణ.

**వనపర్తి,ఆగష్టు 21(ప్రజాస్వరం):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యంపై బిజెపి పాదయాత్ర చేపట్టింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆదేశాల మేరకు గురువారం బిజెపి జిల్లా అధ్యక్షులు నారాయణ ఆధ్వర్యంలో జాతీయ రహదారి 44 నుంచి కడుకుంట్ల వయా పెద్ద గూడెం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్ల క్రితం రోడ్డు పనులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టకపోవడం పై వారు ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. పాదయాత్రలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ కు ఫోన్ చేసి అడిగితే చేసిన పనులకే బిల్లులు కావడం లేదంటూ కాంట్రాక్టర్ ఆ సహనం వ్యక్తం చేసినట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు నారాయణ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అమలు కానీ 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ప్రభుత్వం ఇచ్చిన పలు హామీలపై వెంటనే చర్యలు చేపట్టాలంటే కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి లోక్నాథ్ రెడ్డి రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి పెద్ది రాజు శ్రీనివాస్ గౌడ్ బండారు కుమారస్వామి గొర్ల బాబురావు పి బాలరాజు వెంకటేష్ యాదవ్ ధ్యారపోగు సుబ్రహ్మణ్యం సంద వెంకటేష్ వాకిటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.




# 'ఫీజు రీయింబర్స్‌మెంట్'కు కోత?

**మొదటిపేజీ తరువాయి**

గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సైతం దీన్ని కొనసాగించాయి. లక్షల మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేస్తూ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. ఈ కారణంగానే ఏ ప్రభుత్వమూ ఇందులో ఏ చిన్న మార్పు చేయడానికీ సాహసించలేదు. తాజాగా ఈ పథకం నిబంధనలు సవరిస్తే అన్ని వర్గాల్లో వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు.

**మార్పుల ప్రభావంపై నివేదిక కోరిన ప్రభుత్వం!**

ఇంజనీరింగ్, డిగ్రీ మొదలుకొని అన్ని సాంకేతిక, సాధారణ కోర్సులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హతల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఒక సంవత్సరంలో 50 శాతం సబ్జెక్టులు పాసవ్వడంతో పాటు, 75 శాతం హాజరు ఉండాలనే కొత్త నిబంధన తీసుకురావాలని సీఎం సూచించినట్టు తెలిసింది. దీంతో పాటు ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో నిర్దిష్ట మార్కులను ప్రామాణికంగా తీసుకునే అంశంపైనా ఆయన అధికారులతో చర్చించినట్టు తెలిసింది.

డిగ్రీ కోర్సుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ లోపిస్తున్నాయని, ఇలాంటి వారిని రీయింబర్స్‌మెంట్ నుంచి తప్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం ముఖ్యమంత్రి వ్యక్తం చేసినట్టు తెలిసింది. అదే సమయంలో సాంకేతిక విద్యకు సంబంధించి కొన్ని మార్పులపై ఈ సందర్భంగా చర్చించారు. కోర్సుకు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల్లో విద్యార్థి కనీసం 60 శాతం మార్కులు తెచ్చుకోవాలని, వారికే రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలనే ప్రతిపాదన ముఖ్యమంత్రి తెచ్చినట్టు సమాచారం.

ఉదాహరణకు సీఎస్ఈ ఎమర్జింగ్ కోర్సు తీసుకున్న విద్యార్థి డేటాసైన్స్ సబ్జెక్టులో 60 శాతం మార్కులు తెచ్చుకుని తీరాలి. ఆ విధంగా ఆయా కోర్సులకు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల్లో మంచి మార్కులు రావాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధనలు తీసుకొస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఎంతవరకూ ఉంటుందో నివేదిక ఇవ్వాలని సీఎం కోరినట్టు తెలిసింది.

**కొత్త నిబంధనలతో కష్టమే..!**

రాష్ట్రంలో ప్రతి ఏటా 12.50 లక్షల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్నారు. ఇందులో 5 లక్షల మంది కొత్తవాళ్ళు ఉంటారు. అన్ని కోర్సులకు కలిపి ఏటా రూ.2,350 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు ఎంత ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్ చేస్తున్నారు. బీసీలకు మాత్రం 10 వేల లోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో మొత్తం చెల్లిస్తున్నారు. ఆపై ర్యాంకులకు రూ.35 వేలు మాత్రమే ఇస్తారు.



ప్రస్తుతం మొదటి ఏడాదిలో 50 శాతం సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు అవ్వని విద్యార్థులు దాదాపు 50 శాతం మంది ఉంటున్నారు. ఉన్నత విద్యలో కొత్తగా ప్రవేశించడం, భయం వల్ల వారికి తక్కువ మార్కులు వస్తున్నాయి. ఈ కారణంగానే తొలి ఏడాది పలు సబ్జెక్టులు మిగిలిపోతున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్‌లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. 75 శాతం హాజరు విషయంలోనూ భిన్నాభిప్రాయాలు విన్పిస్తున్నాయి.

యూనివర్సిటీలు డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో ఆన్‌లైన్ కోర్సుల వైపు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. కాలేజీల్లో ఫ్యాకల్టీ లేకపోవడం, కాలేజీకి వచ్చినా పాఠాలు జరగకపోవడంతో విద్యార్థులు ఆన్‌లైన్ బాట పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో హాజరును కొలమానంగా తీసుకుంటే చాలామంది విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఇబ్బంది తప్పదని అధికారులే చెబుతున్నారు.

# కాళేశ్వరం' పిటిషన్లపై హైకోర్టు గరం గరం

- కాళేశ్వరం కమిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ..
- కమిషన్ రిపోర్టును రద్దు చేయాలని కేసీఆర్, హరీష్ రావు పిటిషన్లు..
- కేసీఆర్ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్..
- కేసీఆర్ కు నోటీసు ఇవ్వకుండా ఆయనకు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చారు: లాయర్

**హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పై జస్టిస్ పీ.సీ.ఘోష్ కమిషన్ఇచ్చిన నివేదికను కొట్టి వేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రి హరీష్ రావు లు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాడి వేడిగా వాదనలు జరిగాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీ.సీ.ఘోష్ కమిషన్ ను నియమించి దానిపై న్యాయ విచారణ జరిపించిన విషయం తెలిసిందే. 115మందిని ఓపెన్ కోర్టులో విచారించటంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులో పాలు పంచుకున్న పలువురు ఇంజనీర్లు, అధికారుల నుంచి అఫిడవిట్ల రూపంలో వాంగ్మూలాలు తీసుకున్న కమిషన్ గతనెల 31న నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే, ఈ నివేదికను కొట్టి వేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు ఇటీవల హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను కలిపి వాటిపై హైకోర్టు ఛీఫ్ జస్టిస్ బెంచ్ గురువారం విచారణ జరిపింది. కేసీఆర్(KCR) తరపున సుప్రీం కోర్టు న్యాయవాది సుందరం వాదనలు వినిపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదికను రూపొందించిందని చెప్పారు.

**అసెంబ్లీలో చర్చ జరిగేలా..**

ఇదంతా కక్షపూరిత రాజకీయాల్లో భాగంగా జరిగినట్టుగా అనిపిస్తోందన్నారు. వేర్వేరు కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్(Medigadda Barrage) లోని ఒక పిల్లర్ కుంగిపోయినట్టు చెప్పారు. దీనికి డిజైనింగ్, ఇంజనీరింగ్ తో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. నివేదిక కాపీలను ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఇవ్వకుండా మీడియాకు అంద చేయటంలో దురుద్దేశ్యం కనిపిస్తోందన్నారు. జస్టిస్ పీ.సీ.ఘోష్ కమిషన్ నిబంధనలను పాటించ లేదని చెప్పారు. కమిషన్స్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1952 సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వకుండానే నివేదికను విడుదల చేశారన్నారు. ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిందని చెప్పారు. ఇక, నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిగేలా కాంగ్రెస ప్రణాళిక రూపొందించిందన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి పిటిషనర్లు కేసీఆర్(KCR), హరీష్ రావు(harish Rao) అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న హైకోర్టు అలాంటపుడు నివేదికను ఎందుకు బయట పెట్టారని ప్రశ్నించింది. ఆ వెంటనే కేసీఆర్ తరపు న్యాయవాది సుందరం మీడియా సమావేశాన్ని పెట్టి మరీ ప్రతీ జర్నలిస్టుకు అరవై పేజీల నివేదికను కూడా అందించారని చెప్పారు.

**నివేదిక ఆధారంగా విడుదల చేశారా?**

ఇక, కోర్టుకు ఇచ్చిన నివేదిక కాపీలు సరిగ్గా కనిపించటం లేదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సరిగ్గా కనిపించేలా నివేదిక కాపీలు ఇస్తే తరువాత విచారణ చేస్తామని పేర్కంది. అయితే, కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఇవాళే విచారణ కొనసాగించాలని న్యాయవాది సుందరం విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కాళేశ్వరంపై నివేదికను జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా విడుదల చేశారా? అని అడ్వకేట్ జనరల్ ను ప్రశ్నించింది. నివేదిక కాపీని పబ్లిక్ డొమైన్ లో పెట్టారా?...పిటిషనర్లకు 8బీ సెక్షన్ ప్రకారం నోటీసులు ఇచ్చారా? లేదా?... నివేదిక ప్రస్తుత పరిస్థితి ఏంటి? అని అడిగింది. దీనికి అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ తాము నోటీస్ ఇచ్చినట్టు చెప్పారు. దానిపై సెక్షన్ ను మెన్షన్ చేయనంత మాత్రానా అది 8బీ నోటీస్ కాదంటే ఎలా? అని అన్నారు. నివేదికపై అసెంబ్లీలో చర్చ జరగాల్సిందే అని అన్నారు. ఇక, కాళేశ్వరం(Kaleshwaram) పై కమిషన్ ఇచ్చిన నివేదికను పబ్లిక్ డొమైన్ లో పెట్టలేదని అడ్వకేట్ జనరల్ చెప్పారు. అసెంబ్లీలో చర్చ జరిగిన తరువాతే పెడతామన్నారు. కేసు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్ఓ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. అసెంబ్లీలో నివేదికపై చర్చ జరిగిన తరువాత తదుపరి విచారణ జరపాలన్నారు.

**అసెంబ్లీలో చర్చ జరిగిన తరువాత**

కాగా, సెక్షన్ 8బీ ప్రకారం కాకుండా ఏ సెక్షన్ కింద నోటీసులు ఇచ్చారని హైకోర్టు ప్రశ్నించింది. ప్రజా ధనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కమిషన్ ను నియమించిందని చెప్పిన అడ్వకేట్ జనరల్ కేబినెట్ సులభంగా అర్థం చేసుకునేందుకుగాను అరవై పేజీల నివేదికను తయారు చేశారని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టును కేబినెట్ ఆమోదించినట్టు తెలిపారు. అసెంబ్లీలో చర్చ జరిగిన తరువాత తదుపరి చర్యలపై కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. అసెంబ్లీలో చర్చ జరిగే వరకు దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణ చేయ వద్దని కోరారు. పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయటానికి గడువు కావాలని అడిగారు. సెక్షన్ 8బీ ప్రకారం నోటీసులు ఇవ్వలేదని పిటిషనర్లు తప్పు పట్టటం చెల్లదన్నారు. ఈ దశలో మరోసారి జోక్యం చేసుకున్న హైకోర్టు కాళేశ్వరం కమిషన్ నివేదికను అసెంబ్లీలో ఎప్పుడు పెట్టనున్నారు? అని ప్రశ్నించింది. ఈ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో పెడతారా? అని అడిగింది.



# ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజు పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

- ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు
- కళాశాలల్లోని విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఫీజులు నిర్ధారించాలని నిర్ణయం
- ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలు ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించాలని నిర్ణయం

**హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):**

ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు సమర్పించే అకౌంట్స్‌తో పాటు ఆయా కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధారించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. కళాశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయా? ఆ కళాశాలల్లో విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ ఎలా ఉన్నాయనే అంశాలపై దృష్టి సారించనుంది.

జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను సైతం పరిశీలించిన తర్వాత కళాశాలల్లో ఫీజులను నిర్ధారించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.




# గీతన్నకు కాంగ్రెస్ అన్యాయం

- మద్యం దుకాణాల్లో 25% రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ
- కానీ 15శాతంతోనే సరిపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- గుట్టుచప్పుడు కాకుండా ఎక్సైజ్ పాలసీ నిబంధనల ప్రకటన
- ఈ నెల 14న ఉత్తర్వుల వెల్లడి వారం రోజులపాటు గోప్యత

**హైదరాబాద్ ఆగస్టు 21 (ప్రజాస్వరం):**

బీసీలకు 42% బీసీ రిజర్వేషన్ల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది ప్రేమ కాదు డ్రామా అని చెప్పడానికి ప్రభుత్వం విడుదలచేసిన మద్యం టెండర్ల నోటిఫికేషన్ నిదర్శనంగా నిలుస్తున్నది. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గీత కార్మికులకు 25% రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెసు ప్రభుత్వం.. తీరా అమల్లోకి వచ్చే సరికి మరోసారి మోసం చేసింది. గత పాలసీలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 15% రిజర్వేషన్లకే గీత కార్మికులను పరిమితం చేసింది. ఈ మేరకు నూతన ఎక్సైజ్ పాలసీ విధి విధానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఈ నెల 14వ తేదీనే జీవోను విడుదల చేసింది. కానీ, ఉత్తర్వుల కాపీ మీడియా కంట పడకుండా గోప్యంగా ఉంచింది.

**డిక్లరేషన్‌లో చెప్పిందేమిటి..?**

2023 నవంబర్ 10న బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పుడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య కలిసి బీసీ డిక్లరేషన్‌ను విడుదలచేశారు. అందులో 17వ అంశం కింద గీత కార్మికులకు హామీలిచ్చింది. ఇందులో 'ఈత చెట్ల పెంపకం కోసం ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమి& ఈత మొకలు, బిందు సేద్యం, కాంపౌండ్ వాల్ నిర్మాణాలపై 90% సబ్సిడీ... మద్యం దుకాణాల లైసెన్సుల్లో గీత కార్మికులకు ప్రస్తుతం ఉన్న 15% రిజర్వేషన్ 25 శాతానికి పెంపు..' అని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ మద్యం దుకాణాల్లో గౌడ సామాజికవర్గానికి 25% రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ తీరని అన్యాయమే చేసిందని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాకు చెందిన గీత కార్మిక నేత వెంకటేశ్‌గౌడ్ విమర్శించారు.



**నిట్టనిలువుగా ముంచి**

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలంటే కోర్టులు, చట్టాలు, బిల్లులు తదితర ప్రక్రియలు ఉన్నాయి. బీసీ రిజర్వేషన్ల మీద అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించారు. గవర్నర్ వాటిని ఆమోదించకుండానే కేంద్రానికి పంపినట్టు కాంగ్రెస్ నేతలే బయట చెప్తున్నారు. గవర్నర్ ఆమోదించని విషయాన్ని ఇప్పటివరకు ప్రజలకు చెప్పకుండా.. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఆర్డినెన్స్ తెచ్చింది. దానికి కూడా ఆమోదం తెలపకుండానే గవర్నర్ కేంద్రానికి పంపించారు. ఆయా బిల్లులకు పార్లమెంటు ఆమోదం తప్పనిసరి. అయితే, ఆ బిల్లుల విషయంలో ఇండియా కూటమి తీసుకున్న కార్యాచరణ ఏదీలేదని ఢిల్లీ కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. 'బీసీలకు 42% రిజర్వేషన్ల సంగతి పక్కనే పెడితే.. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 25% రిజర్వేషన్లు అమలు పూర్తిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతిలోని పనే కదా? ఒక్క సంతకంతో అమలు చేయొచ్చు. గౌడ రిజర్వేషన్ల అమలుపై కనీస చర్చ పెట్టకపోవడానికి కారణం ఎవరు? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేకపోయింది? ఈ ఒక లాజిక్‌ను అర్థం చేసుకుంటే చాలు బీసీలకు 42% రిజర్వేషన్ల మీద సీఎం రేవంత్‌రెడ్డిది ప్రేమా? డ్రామా? అర్థం అయిపోతుంది' అని ఒక రాజకీయ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు.

# సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు నమ్మొద్దు

## పండుగలు ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలి

## సుప్రీంకోర్టు నిబంధనలు ప్రకారం డీజే నిషేధం

## డీఎస్పీ ప్రసన్న కుమార్






**మెదక్, ఆగస్టు 21 (ప్రజా స్వరం) :**
వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకొని గురువారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ ను పీస్ కమిటీ మీటింగ్ టౌన్ సీఐ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ప్రసన్న కుమార్ విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అందరూ కలిసి మెలసి ప్రశాంతమైన వాతావరణం లో పండగలను జరుపుకోవాలని అన్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో కరెంట్ వైర్స్ తో జాగ్రత్తగా ఉండాలని, మండపంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు సహకరించాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ఎవరు నమ్మకూడదనీ తెలిపారు. గణేష్ నిమర్జనం ప్రక్రియ అందరూ ఒకే రోజు లో పూర్తి చేసుకుంటే ప్రజలు అందరూ చూసే అవకాశం ఉంటుందని అన్నారు. శోభాయాత్ర ఎలాంటి అసౌకర్యాలు లేకుండా రోడ్డు లో గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గణేష్ మండపం ఏర్పాటు చేసేందుకు ఆన్లైన్ ఇంటిమేషన్ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీసులకు సమాచారం ఇస్తే పరిష్కరిస్తామని అన్నారు. సుప్రీంకోర్టు నిబంధనలు ప్రకారం డీజే లకు నిషేధం అని చిన్న సౌండ్ బాక్స్ పెట్టుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 5 న మిలాద్ ఉన్ నబీ పండగ 5 న వస్తుందని అందరూ పండుగలను ప్రశాంతమైన వాతావరణం లో చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ లు అమర్, మల్లికార్జున్, వివిధ మతాల సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





## 180 కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**పటాన్‌చెరు, ఆగస్టు 21 (ప్రజాస్వరం) :**
పేదింటి ఆడపడుచుల వివాహాలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు వెన్నంటే నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో గుమ్మడిదల,జిన్నారం, అమీన్పూర్, పటాన్ చెరువు, రామచంద్రపురం రెవెన్యూ మండలాల వివిధ గ్రామాలకు చెందిన 180 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను గురువారం నాడు పంపిణీ చేశారు.

## సరిహద్దుల సర్వేకు శ్రీకారం

### సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంరెడ్డి

**వికారాబాద్, ఆగస్టు 21(ప్రజా స్వరం) :**
పరిపాలనా సరిహద్దుల డేటాబేస్ లో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా వారు వికారాబాద్ జిల్లా ను పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి, వికారాబాద్ జిల్లాలో గల అన్ని గ్రామ సరిహద్దులను సర్వే చేయుట కొరకు నిర్ణయించినట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. రామ్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో మొదటిగా వికారాబాద్ మండలములో గురువారం నుండి గ్రామాల సరిహద్దుల సర్వే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పరిపాలన సరిహద్దులను నిర్ధారిస్తే రెవిన్యూ ,మండల పరిషత్, గ్రామ పంచాయతీల రికార్డులు సమగ్రంగా ఉంటాయని తెలిపారు. తద్వారా



ప్రజలకు సరిహద్దుల ఇబ్బందులు పరిష్కారం అవుతాయని అన్నారు.

## ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్వో తనిఖీలు



**మెదక్, ఆగస్టు 21 (ప్రజా స్వరం) :**
రైతులు ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియాను సరిపడా అందజేస్తామని తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే మన జిల్లాకి సరిపడినంత యూరియా రానున్నదని, రైతులు ఎటువంటి ఇబ్బంది పడరాదని సూచించారు. రైతులకు అవసరమైనంత మేరకు ఎరువులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో వెనుకబడిన వికారాబాద్

## వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**వికారాబాద్, ప్రజాస్వరం :**
వికారాబాద్ జిల్లా ప్రజా సమస్యల పరిష్కారం, ముఖ్యంగా విద్యాపరంగా, జిల్లా వెనుకబడి ఉందని వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా జరిగిన కార్యమంలో అమె ప్రసంగించారు. జిల్లా ఆస్పత్రి ఉన్నప్పటికీ సౌకర్యాలు కొరతతో ప్రజలు అనునిత్యం వైద్యం కోసం హైదరాబాద్, గుల్బర్గా వెళ్లవలసి వస్తుందని, ఇంచుమించు చాలా జిల్లాల్లో ఇటువంటి పరిస్థితులే ఉండవచ్చని, కావున అన్ని వసతులతో జిల్లా ఆస్పత్రులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి , స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం కావున సమస్యల పరిష్కారానికి , ప్రభుత్వం పై వత్తిడి తీసుకోవాలని, మన ప్రాంతంలో ఉన్న సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీని ప్రైవేటు పరం కాకుండా చూడాలని, సిమెంటు, సుద్ధ ఫ్యాక్టరీల్లో, నాపరాతి గనుల్లో, పాలుషింగ్ యూనిట్లలో, కొన్నివేల సంఖ్యలో




కార్మికులు పనిచేస్తున్నప్పటికీ నేటికీ ఇక్కడ ఈఎస్ఐ ఆసుపత్రి లేదు. శాంక్షన్ అయిందని చెప్తున్నారు. నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని వెంటనే ఆసుపత్రిని ప్రారంభించాలని వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ప్రతిపాదించడం జరిగింది.

# ప్రహరీ నిర్మాణానికి రూ. కోటి అందిస్తా

## ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు, ఆగస్టు 21(ప్రజా స్వరం) :**
తాండూరు పట్టణంలో వినాయక ఉత్సవాలు ఎప్పటిలాగే ఘనంగా నిర్వహించాలి అని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణ హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం హైదరాబాద్లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అందరి సహకారం తీసుకోండి అని అన్నారు. హిందూ ఉత్సవ కమిటీ స్థల ప్రహరీ గోడకు ఎమ్మెల్సీ కోట నిధుల నుంచి కోటి రూపాయలు అందిస్తా అని మహేందర్ రెడ్డి హామి ఇచ్చారు. హిందూ ఉత్సాహ కమిటీతో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి. గతంలో తాను రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇప్పిచ్చిన స్థలానికి ప్రహరీ గోడ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైనన్ని నిధులు అందిస్తా. మైనారిటీలు వారికి ఇచ్చిన స్థలాలను అభివృద్ధి పరిచిన మాదిరిగానే మీరు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోండి. సంప్రదాయాలను అందరూ గౌరవించాలని, ఉత్సవాలు, వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలు కాపాడుతూ భక్తి భావం పెంపొందేలా నిర్వహించుకోవాలని హిందూ కమిటీతో మహేందర్ రెడ్డి అన్నారు.



# వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ పొడిగించాలి

**వికారాబాద్, ఆగస్టు 21(ప్రజా స్వరం) :**
వికారాబాద్ జిల్లా ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా ఎంఎంటీఎస్ రైలు వికారాబాద్ రైల్వే స్టేషన్ వరకు రావాలని కోరుతున్నారు. అయితే, రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే ఈ హామీని ఇచ్చి, ఆ తర్వాత మరచిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వికారాబాద్ పట్టణం నుండి ప్రతిరోజూ 2 వేల మందికి పైగా ప్రజలు హైదరాబాద్‌కు ఉద్యోగాలు, చదువులు, ఇతర అవసరాల కోసం ప్రయాణం చేస్తున్నారు. కానీ సమయానికి రైళ్లు అందుబాటులో లేకపోవడంతో, ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో రద్దీతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. "ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు ఇస్తారు, తర్వాత మాత్రం వికారాబాద్ ప్రజల సమస్యలను పట్టించుకోరని" స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, ప్రస్తుతం ఉన్న ఎంపీ మరియు రాజకీయ నాయకులు చొరవ తీసుకొని, ఎంఎంటీఎస్ రైలును వికారాబాద్ వరకు పొడిగించే చర్యలు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజాపాలన అంటే ఇదేనా?

- చెప్పుల వరుస వద్ద రైతు పడుకున్న ఫొటోను ట్వీట్ చేసిన బీఆర్ఎస్, కేటీఆర్
- తెలంగాణ వ్యాప్తంగా తీవ్రమైన ఎరువుల కొరత
- గ్రామాల్లోని ఎరువుల కేంద్రాల వద్ద రైతుల బారులు
- ప్రభుత్వ పాలనపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- రైతులను రోడ్లపైకి తీసుకురావడమేనా ప్రజా పాలన అని బీఆర్ఎస్ ప్రశ్న

**హైదరాబాద్ ఆగస్టు 21(ప్రజాస్వరం):**తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో ఎరువుల పంపిణీ కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి నిరీక్షిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వ్యవసాయ పనుల సీజన్‌లో ఎరువులు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. "ప్రజా పాలన అంటే ప్రజలను ఇలా రోడ్ల మీదకు తీసుకురావడమేనా?" అంటూ బీఆర్ఎస్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. కేటీఆర్ కూడా సామాజిక మాధ్యమం వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "రేవంత్ రెడ్డీ, నీ దరిద్రపుగొట్టు పాలనకు దక్కిన అసమర్థ ఆస్కార్ అవార్డు ఇది" అంటూ వనపర్తి జిల్లా ఆత్మకూరు పీఏసీఎస్ ఎదుట చెప్పుల వరుస వద్ద ఒక రైతు పడుకున్న ఫొటోను పంచుకున్నారు. ఈ ఫొటోను ఫ్రేమ్ కట్టించుకుంటావో.. మెడలో వేసుకొని ఊరేగుతావో నీ ఇష్టమని వ్యంగ్యంగా అన్నారు. చేతకాని పాలకులను చూశాం కానీ చెప్పులపాలు చేసిన చెత్త రికార్డు మాత్రం రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. బస్తా యూరియా కోసం



రైతు బతుకును బజారున పడేశావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అన్నం పెట్టే రైతన్నను పాదరక్షల పాలుచేసిన నీ పాపం ఊరికేపోదు. జై కిసాన్.. జై తెలంగాణ" అంటూ ఆయన పేర్కొన్నారు.

## వలిగొండలో ఘనంగా బోనాల పండుగ

**వలిగొండ,ఆగష్టు 21(ప్రజాస్వరం):**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో పద్మశాలి కుల దైవం మధ్యలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శివశక్తుల నృత్యాలు డప్పు వైద్యాలతో మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించి మద్దెలమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు.మహిళలు సంప్రదాయ బద్ధంగా బోనాలు సమర్పించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.పెద్దలు మహిళలు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్లలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**చేవెళ్ల ఆగస్టు 20(ప్రజాస్వరం):**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు, మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధి దామరగిద్ద వార్డులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా, మధుసూదన్ గుప్తా, దావల్ గారి గోపాల్ రెడ్డి, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు సూర్యాపేట శ్రీనివాస్ గౌడ్, నాయకులు పడాల రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.





## 23 నుంచి కళాభారతిలో జాతీయ పురస్కార సభలు

**విశాఖపట్నం,ఆగష్టు 21(ప్రజాస్వరం):**కళాభారతి గత 24 సంవత్సరాలుగా ప్రతిసంవత్సరం ఆగస్టులో జాతీయ పురస్కార సభ ఆరురోజులు సంగీత, నృత్య, నాటక ఉత్సవాలు నిర్వహిస్తోంది. ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఆరు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి.23న ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావుకు నాద విద్యా భారతి బిరుదుతో సత్కరించనున్నట్టు కళాభారతి కార్యదర్శి డా. జి.రాంబాబు తెలిపారు.రెండున్నర లక్షల విలువ చేసే స్వర్ణకమలం,లక్ష రూపాయలు నగదు బహుమతి,నూతన పట్టువస్త్రాలు,ప్రశంసాపత్రం ఇచ్చి దుర్గాప్రసాదరావును సత్కరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.ఈ బిరుదు ప్రదాన మహోత్సవం 23వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు జరుగుతుందన్నారు.సత్కార సభఅనంతరం సంగీత సుధానిది విద్వాన్ ద్వారం సత్యనారాయణ వాయులీన వాయిద్య కచేరి ఉంటుందన్నారు. రెండవరోజు 24న కర్నాటక గాత్రం హిందుస్థానీ గాత్రం ఇద్దరు విద్వాంసలు పూర్ణిక కృష్ణన్ ముంబై, విద్వాన్ నివేదిత భట్టాచార్జీ కోల్కతా,వీరు ఇరువురు కలిసి హిందుస్తానీ కర్నాటక గాత్ర సంగీతంలో జుగల్బందీ ఉంటుందన్నారు.25న పేరుగాంచిన ప్రముఖ కర్నాటక గాత్ర విద్వాంసులు విష్ణుభట్ల సిస్టర్స్ గా ప్రసిద్ధిగాంచిన వారి గాత్ర యుగళం ఉంటుందని, 26న కర్నాటక సంగీత యుగళ గాత్రంలో పేరుగాంచిన ప్రఖ్యాత బెంగుళూరు బ్రదర్స్ వారిద్దరి కర్నాటక గాత్ర సంగీత కచేరీ ఉంటుందన్నారు. 27న భారత కళా గ్రామ నాట్య గురుకులం బెంగుళూరు వారు డాక్టర్ ఆర్.వసంత కిరణ్ ఆధ్వర్యంలో 33 మంది నృత్య కళాకారులతో హరిలీలా కల్పతరువు అనే కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించబోతుందన్నారు. 28న డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్యమండలి విజయవాడ వారిచే గొప్ప చారిత్రాత్మక పద్య నాటకం శ్రీ ఖడ్గ తిక్కన 38 మంది నటీనటులతో ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలు వీక్షించేందుకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షులు ఎం ఎస్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, ట్రస్టీ గ్రంధి మల్లిక మనోజ్, పి.నరసింగరావు, మేనేజర్ మోహన్ దాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు.

## ఘనంగా మాజీ జడ్పీటిసి కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

**శంకర్ పల్లి ఆగస్టు 21(ప్రజాస్వరం):**మొయినాబాద్ మాజీ జెడ్పీటిసి కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకలను ఘనంగా చేవెళ్ల కెజిఆర్ గార్డెన్ లో నిర్వహించారు. గురువారం గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకల ఘనంగా సాగాయి. కేక్లను కట్ చేయించి ఆయనకు శాలువాలు కప్పి, బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేస్తా: విజయ్

- అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, టీవీకేకు మధ్య ప్రధాన పోటీ ఉంటుందని వ్యాఖ్య
- అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్న విజయ్
- మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తానని ప్రకటన



**నేషనల్ బ్యూరో ఆగస్టు 21(ప్రజాస్వరం):**తనను ఎంతగా విమర్శిస్తే అంతగా ఎదుగుతానని టీవీకే పార్టీ అధ్యక్షుడు, తమిళ అగ్ర నటుడు విజయ్ పేర్కొన్నారు. తమ భావజాల శత్రువు బీజేపీ, రాజకీయ విరోధి డీఎంకే అని ఆయన స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీకి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపు తడతామని తెలిపారు. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో విజయ్ ప్రసంగిస్తూ, అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. కులం కాదు.. మతం కాదు తమిళుడికే ప్రాధాన్యం ఇస్తామని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తులు పెట్టుకుంటున్నాయని విమర్శించారు. మనం ఆరెస్సెస్ ముందు ఎందుకు తలవంచాలని ఆయన ప్రశ్నించారు. తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఢిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఆయన పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. 2024 ఫిబ్రవరిలో టీవీకేను స్థాపించినప్పటి నుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గత ఏడాది విల్లుపురం జిల్లాలోని విక్రవందిలో మొదటి సభను నిర్వహించారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఏపీ కేబినెట్ ఆమోదం

- ముగిసిన సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశం
- మొత్తం 33 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర
- అమరావతిలో మౌలిక వసతులకు రూ.904 కోట్లు కేటాయింపు
- కొత్త అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణానికి పరిపాలన అనుమతులు




**అమరావతి బ్యూరో ఆగస్టు 21(ప్రజాస్వరం):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మొత్తం 33 అజెండా అంశాలపై చర్చించి, వాటన్నిటికీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.904 కోట్లు కేటాయిస్తూ సీఆర్‌డీఏ చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు, అమరావతిలో కొత్తగా అసెంబ్లీ భవనాన్ని రూ.617 కోట్లతో, హైకోర్టు భవనాన్ని రూ.786 కోట్లతో నిర్మించేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నిర్ణయాలతో రాజధాని నిర్మాణ పనులు మళ్లీ వేగం పుంజుకోనున్నాయని స్పష్టమవుతోంది. వ్యవసాయ, సాగునీటి రంగాలకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేసింది. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1000 కోట్ల రుణం సమీకరించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా, పోలవరం ఎడమ కాల్వ పనులకు రీటెండర్‌కు, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు కూడా ఆమోద ముద్ర వేసింది. సామాజిక న్యాయం దిశగా మరో కీలక అడుగు వేస్తూ, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 'ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ 4.0'ను కూడా మంత్రివర్గం ఆమోదించింది. అనంతపురం జిల్లాను సౌర, పవన విద్యుత్ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టులకు, రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల కోసం భూముల కేటాయింపునకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును మార్చే ప్రతిపాదనను కూడా మంత్రివర్గం అంగీకరించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, ఈ నిర్ణయాలు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. మంత్రులంతా ప్రజలతో మమేకమై, దూకుడుగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారని ఆయన వివరించారు.

## బాలుడి ప్రాణం తీసిన వేడిపాలు



**అమరావతి ఆగస్టు 21(ప్రజాస్వరం):**వేడి పాలు మీదపడడంతో ఓ బాలుడు ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుత్తిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోటలోని పోస్టాఫీసు వద్ద ప్రతాప్‌రెడ్డి తన భార్యతో కలిసి ఉంటున్నాడు. 15 నెలల క్రితం ఈ దంపతులకు ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. వారిలో శర్విత్ రెడ్డికి పాలు తాగించాలని నిర్ణయం తీసుకున్నారు. పాలు బాగా చేసిన చల్లారడానికి గదిలో పెట్టి వెళ్లిపోయారు. శర్విత్ పాక్కుంటూ వేడిపాల దగ్గరికి వెళ్లాడు. పాలు ముఖం మీదపడడంతో ఊపిరాడక అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో కన్నతల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.



## కాంగ్రెస్ పార్టీ అబద్ధపు పాలనా చేస్తుంది

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**చేవెళ్ల ఆగస్టు 21(ప్రజాస్వరం):**రాష్ట్రములో కాంగ్రెస్ పార్టీ అబద్ధల పాలనా చేస్తుంది. రాహుల్ గాంధీ నోటికి ఏది వస్తే అది అబద్ధాలు మాట్లాడుతున్నాడు. రాష్ట్రములో రాజకీయ మార్పు జరగాలిఅని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. చేవెళ్ల మండలంలోపల్లె పల్లెకు బిజెపి అనే కార్యక్రమని రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు గురువారం చేవెళ్ల కేంద్రంగా ప్రారంభించారు. చేవెళ్ల లక్ష్మి వెంకటేశ్వర స్వామి దర్శించుకుని అక్కడినుంచి మండలంలోని చాన్వెల్లి గ్రామంలో రైతులతో మాట్లాడి ఖానాపూర్ గెట్ వద్ద ఉన్న శ్రీ శ్రీనివాస్ కళ్యాణ మండపంలో యువ సమ్మేళనంలో పాల్గొన్ని వారు మాట్లాడుతూ యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరి రాష్ట్రములో రాజకీయ మార్పు తీసుకరావాలిన్నారు. రాబోయే రోజులో ఉద్యమం అవసరం అయితే యువత ముందుండలిన్నారు. చేవెళ్ల ప్రాంతంలో కొంత కాలంగా కుటుంబ పాలనా నడుస్తుంది. మేము చెప్పిందే చేవెళ్లలో నడవాలి అన్నట్టు ఇక్కడ రాజకీయం ఉంటుందిన్నారు. కానీ చేవెళ్లను మాత్రం ఎటువంటి అభివృద్ధి చేయలేదున్నారు. నరేంద్ర మోడీ యువత ఉపాధి నలుగురికి ఇచ్చే విదంగా కార్యక్రమాలు పథకాలు తీసుకవస్తున్నారు. తెలంగాణలో యువతను మభ్యపెట్టి పాలనా చేస్తున్నారున్నారు. స్థానిక ఎన్నికలో మార్పు చేవెళ్ల నుంచే మొదలు కావాలిన్నారు. ఎంపిటిసి జడ్పీటీసీ స్థానాలు గెలిచి జిల్లా జడ్పీ చైర్మన్పర్సన్ గెలువాలిన్నారు. రాష్ట్రములో యువత కొత్త వెలుగు కొరకు చూస్తుంది. అ వెలుగు బిజెపియే కావాలిన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని చేవెళ్లలో చేసిన డిక్లరేషన్ ఏటుపోయిందిఅని ప్రశ్నించారు. చేవెళ్ల యువతను చూసాక ఆత్మ విశ్వాసం పెరిగింది అన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీలోనుంచి పెద్ద ఎత్తున్న శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో యువత పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె. ఎస్ రత్నం, జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, అదె శ్రీరామ్,అంజన్ గౌడ్,వెంకట్ రెడ్డి, జ్ఞానేశ్వర్,మాజీ ఎంపిపి విజయ లక్ష్మి రమణ రెడ్డి, అనంత రెడ్డి, శ్రీకాంత్, డా "వైభవ్ రెడ్డి, కృష్ణ మోహన్,శంకర్ గౌడ్,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ కమిషనర్ గా యాదగిరి



**తాండూరు ఆగస్టు 21(ప్రజాస్వరం):**ఆగస్టు 18న తాండూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ దాడుల్లో రూ. 15 వేలు లంచం తీసుకుంటూ రమేష్‌ని రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఏసీబీ దాడులు నిర్వహించే సమయంలో తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లేకపోవడంతో ఉన్నత అధికారులు ఆయన పై బదిలీ వేటుతోపాటు మెమోను జారీ కూడా బుధవారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో తాండూరు మున్సిపల్ కమిషనర్ గా గ్రేడ్ 3 కమిషనర్ గా ఉన్న యాదగిరి గురువారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి అన్ని రకాల అందరూ సహకరించాలని ఆయన కోరారు.

**విక్రమ్ సింహరెడ్డి వసూళ్లకు హుక్..!**

మున్సిపల్ కార్యాలయంలోని ప్రతి సెక్షన్ నుంచి నెలకు 2 లేదా 3 లక్షలు ఇవ్వాలని బదిలీ అయినా కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి అధికారులకు హుక్ జారీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆయనపై అనేక అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో మున్సిపల్ కార్యాలయం నుంచి భారీ అవినీతి తిమింగలం బయటపడ్డాదని పట్టణ ప్రజలు సంతోషం వెదజల్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ యాదగిరి కార్యాలయంలో అవినీతి జరగకుండా అధికారులపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా పెట్టాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.

## హత్య కేసు నిందితులను త్వరలోనే పట్టుకుంటాం.

**హత్య ఘటన స్థలిని పరిశీలించిన ఎస్పీ రావుల గిరిధర్.**

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 21 (ప్రజాస్వరం):**పానగల్ మండల కేంద్రంలో చోటు చేసుకున్న హత్య కేసు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో హత్యకు గురైన ఘటనా స్థలిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆధారాల కోసం క్లూస్ టీం ఏర్పాటు చేశారు. హత్య జరిగిన సంఘటనను స్వయంగా పరిశీలించి అన్ని కోణాలలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐ కృష్ణయ్య స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్ పానగల్ ఎస్సై శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





# నేరస్తుడి అరెస్ట్.

- 11 లక్షల 43 వేల నగదు, 30 గ్రాముల బంగారం, బైక్, ఫోన్ స్వాధీనం.
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రావుల గిరిధర్.

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 21 (ప్రజాస్వరం):** ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన పాల్పడిన నేరస్తుడిని పట్టుకొని 11 లక్షల 43 వేల నగదు 30 గ్రాముల బంగారం, బైక్, మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. వనపర్తి రూరల్, బిజినేపల్లి, కొత్తకోట పోలీసు స్టేషన్ల పరిధిలో పానగల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎం. రమేష్ అనే వ్యక్తి వివిధ దొంగతనాలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి నేతృత్వంలో గురువారం మర్రికుంట దగ్గర వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వాహన పత్రాలు సరిగా లేకపోవడంతో ఆయనను అదుపులోకి తీసుకొని విచారించగా వివిధ నేరాల గుట్టును వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కేసు చేదనలో ప్రముఖ పాత్ర వహించిన సీఐ కృష్ణయ్య, రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, ప్రొబేషనరీ ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుళ్లు రఫీ ఆంజనేయులు నవీన్ గౌడ్ లను అభినందించి నగదు రివార్డు అందజేశారు.

# ఎసిబి వలలో ఆర్మూర్ ఎంవిఐ



**నిజామాబాద్ ఆగస్టు 21(ప్రజాస్వరం):** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎంవీఐ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. వాహనానికి సంబంధించి చెక్‌లిస్ట్‌లో క్లియరెన్స్ కోసం ఎంవీఐ గుర్రం వివేకానంద రెడ్డి ఓ వ్యక్తి నుంచి రూ.25 వేలు డిమాండ్ చేశారు. సదరు వ్యక్తి ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఎసిబి డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం 16 మందితో కూడిన బృందం ఆర్మూర్ ఎంవిఐ కార్యాలయం చుట్టుపక్కల నిఘా ఉంచారు. ఫైల్లు పెండింగ్ ఉన్న సదరు వ్యక్తి ఎం వి ఐ అధికారి అసిస్టెంట్. తిరుపతి వాహనం యజమానికి 25వేలు అందించాడు. అధికారి అసిస్టెంట్ ఎంవీఐకి లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. గతంలో ఏవైనా అవకతవకలు జరిగాయని పరిశీలించిన తర్వాత ఎంవిఐ అధికారి ఇంట్లో, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. అధికారుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



# విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, కంపచెట్లు తొలగింపు.

**వనపర్తి,ఆగష్టు 21 (ప్రజాస్వరం):** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఒకటో వార్డు రాయి గడ్డలో ప్రభుత్వ పాఠశాల దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ప్రమాదకరంగా ఉన్న పిచ్చి మొక్కలను, కంపచెట్లను విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఉన్న కంపచెట్ల సమస్యను కాంగ్రెస్ నాయకులు దేవన నాయుడు దృష్టికి తెగా స్పందించిన దేవన్న నాయుడు విద్యుత్తు, మున్సిపల్ అధికారులతో మాట్లాడి మున్సిపల్ సిబ్బంది సహకారంతో పిచ్చి మొక్కలను తొలగించారు. శాసనసభ్యులు తూడి మెగా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.



# వనపర్తి జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంటాం

- జిల్లా అభివృద్ధిలో కంకణ బద్దులం అవుతాం.
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 21(ప్రజాస్వరం):** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల ఆశీర్వాదంతో వనపర్తి జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ పొలిటికల్ జేఏసీని స్థాపించి.. ఓ వైపు బీసీల హక్కుల కోసం పోరాడుతూనే ఈ ప్రాంత బిడ్డగా.. ఇక్కడ జరుగుతున్న అవినీతిని.. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వాన్ని ఎండగడుతున్నానన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న నామినేటెడ్ మరియు ఇతర పదవులలో బీసీలకు 42 శాతం కేటాయించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ పొలిటికల్ జేఏసీ తమ అభ్యర్థులను నిలబెట్టి..గెలిపించుకుని జిల్లాలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, ఖచ్చితంగా గెలిచేలా వ్యూహాత్మక ఎత్తుగడలు ఫాలో కావాలని వివరించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు నాయకులు కుట్రలు చేస్తుంటారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజ్యాధికారానికి మూలం స్థానిక సంస్థలని, వాటిని చేజిక్కించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే గెలిపిస్తారని, ప్రజల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కోసం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ,నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు అరవిందా చారి, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్,కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్,జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్,శ్రీరంగాపూర్ మండల అద్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, మదనాపూర్ మండల కన్వీనర్ నరసింహ యాదవ్,యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.




# వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి.

**జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజిని.**

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 21 (ప్రజాస్వరం):** వృద్ధాప్యంలో ఉన్నవారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జ్ వి. రజని అన్నారు.గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది.ఈ సదస్సులో కార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు.పిల్లలు వృద్ధాప్యంలో ఉన్నతల్లిదండ్రుల కనీస అవసరాలను తీర్చకపోయిన వారికి గృహంలో స్థానం కల్పించకపోయినా "తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ మరియు సంరక్షణ చట్టం, 2007" ప్రకారం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ కు తమ పిల్లలనుండి నెలకు సరిపడు డబ్బులు ఇప్పించాలని మెయింటెనెన్స్ కంప్లైంట్ ఇవ్వవచ్చు అని తెలియజేశారు. అత్యధికంగా పదివేల రూపాయల వరకు మెయింటెనెన్స్ అమౌంట్ కోరవచ్చని తెలిపారు. ఎవరైనా తల్లిదండ్రులను నిరాశ్రయులను చేస్తే 14567 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి కంప్లైంట్ చేయాలని సూచించారు. వృద్ధుల హక్కులకు సంబంధించిన లఘు చిత్రాలను వృద్ధులతో కలిసి వీక్షించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనితీరు గురించి ఏ విధముగా సంస్థ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు , విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తుందో తెలియజేశారు.న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్,మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో ఒక్కడే రూ.400 కోట్ల విలువైన భూమిని కబ్జా చేశాడు

- కబ్జాకు గురైన పార్కులు, అక్రమణదారుల చెర నుంచి రోడ్డును కాపాడిన హైడ్రా
- అక్రమంగా వెలిసిన పలు నిర్మాణాల కూల్చివేత



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 21(ప్రజాస్వరం):** రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రోడ్లను ఆక్రమించి చేపట్టిన పలు నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా 2 ఆక్రమణకు (దాదాపు 8,500 గజాలు) గురయ్యాయి. అలాగే 5,000 గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఈ విధంగా మొత్తం 16000 గజాల స్థలాన్ని అక్రమణదారుల నుంచి హైడ్రా కాపాడింది. ఈ ఆస్తుల విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుంది. 1995లో అనుమతి పొందిన ఈ లేఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది.

**హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు**

ఈ లేఔట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఔట్ ప్రతినిధులు హైడ్రా నిర్వహించే ప్రజావాణిలో కంప్లైంట్ చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధరించుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్లుగా సూచిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీసు కేసులు పెడుతున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు

**జైహింద్‌రెడ్డిపై ఫిర్యాదుల**

హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల సర్కారు స్థలాన్ని ఆక్రమించి అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రాకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ.4 లక్షల వరకూ ఆదాయాన్ని పొందుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దెను వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ ఓనర్లకు తెలియకుండా తర్వాత ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ భూమి అయితే సర్కారుకు చెందుతుందని మధ్యలో జైహింద్ రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైడ్రా గురువారం ఆక్రమణలను కూల్చివేసింది. హైదరాబాద్ నగరంలో నీటి వనరులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకోసం పనిచేస్తున్న హైడ్రా ఇప్పటికే పలు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపింది. అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడింది.



# ఐఐటి, నీట్ ఫౌండేషన్ ను ప్రారంభించిన డీఈవో అబ్దుల్ ఘని.

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 21 (ప్రజాస్వరం):** వనపర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఐఐటి, నీట్ ఫౌండేషన్ను జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇదే పాఠశాలలో విద్యనభ్యసించి, ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం గర్వకారణం అన్నారు. జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది” అని పేర్కొన్నారు. “ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేని, ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలోనే ఐఐటి, నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలకు ఉచిత శిక్షణ వనరులు లభించడం విశేషం అన్నారు. వేల రూపాయలు ఖర్చు చేయలేని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు ఈ అవకాశాలు లభించడం శుభపరిణామం” అని అభిప్రాయపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురు రాజ్ యాదవ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ZPHS పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురురాజు యాదవ్ స్వయంకృషితో విద్యార్థుల కోసం ఐఐటి మరియు నీట్ ఫౌండేషన్ను అందుబాటులోకి తెచ్చిన విషయం ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ZPHS పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించి తమ ప్రతిభను నిరూపిస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో MEO మద్దిలేటి మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



# పెచ్చులూడిన కొత్త కలెక్టరేట్... ఆర్అండ్ బి ఈఈకి తప్పిన ప్రమాదం



**మహబూబ్ నగర్ ఆగస్టు 21(ప్రజాస్వరం):** రోడ్డు భవనాల శాఖ, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్షంతో నూతన కలెక్టరేట్ భవనం నాణ్యతకు తిలోదకాలు ఇచ్చింది. కొత్త కలెక్టరేట్ భవనం ప్రారంభమై 3 సం.రాలు గడవకముందే పెచ్చులూడుతున్నాయి. అది కూడా స్వయంగా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు పర్యవేక్షించి రోడ్డు భవనాల శాఖ కార్యాలయంలోనే పెచ్చులుడాయి. బుధవారం రాత్రి ఈ కార్యాలయంలో ఎవరు లేని సమయంలో పెచ్చులు ఉండడంతో ఈఈ కి ప్రమాదం తప్పింది. ఉదయం చూసేసరికి ఈఈ కార్యాలయంలో పెచ్చులూడడం చూసి కార్యాలయ సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ నూతన కలెక్టరేట్ భవనం రూ 40 కోట్లతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది.ఈ భవన నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఇది ఈ కలెక్టరేట్ పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆర్ అండ్ బి అధికారులు, ఇంజనీరులు మామూలుగా అలవాటు పడి నిర్లక్షంగా వ్యవహరించినట్లు స్పష్టమవుతుంది. దీంతో కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యతకు మంగళం పాడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టరేట్ పనులు చేసిన కాంట్రార్ ఇప్పటికే అన్ని బిల్లులు డ్రా చేసుకునట్లు తెలుస్తోంది. వాస్తవానికి పనులు పూర్తయినప్పటికీ నాణ్యత లేకపోతే ఫైనల్ బిల్లు పెండింగ్ పెట్టాల్సిన అవసరం ఉంటుంది. నిర్ధిష్ట సమయం వరకు కలెక్టరేట్‌లో ఏం జరిగినా సంబంధిత కాంట్రాక్టర్‌కే బాధ్యత వహించాల్సి ఉంటుంది.అయితే ఇప్పుడు కలెక్టరేట్‌లోనే పెచ్చులు ఊడుతుండడంతో నూతన కలెక్టరేట్ భవనం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాసిరకం మెటీరియల్ వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉండే కలెక్టరేట్ భవనంలో అధికారులకు రక్షణ ఉంటుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కార్యాలయంలో ఎక్కడ చూసినా కూడా లీకేజి గురై వర్షపు నీరు చేరుతోంది. దీంతో ఈ నూతన కలెక్టరేట్ భవనం నాణ్యత లేదనే విషయం తెలుస్తోంది. అప్పట్లో నాణ్యతపై చర్యలు తీసుకోవాల్సిన ఆర్ అండ్ బి అధికారులు మామూలు వ్యవహారంలో మునిగి తేలడంతోనే పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పనులపై విచారణ చేపట్టి నూతన కలెక్టరేట్ భవనం పనులను పరిరక్షించాల్సిన అవసరం ఉంది.



# కాకరకాయ ఒక్కసారి ఇలా ట్రై చేసి చూడండి

కాకరకాయ పేరు వింటేనే చాలామంది ముఖం తిప్పేసుకుంటారు. ఇంట్లో కాకరకాయ కూర చేశారంటే ఆ రోజు ఉపవాసం ఉంటారు. ఎందుకంటే కాకరకాయ చేదుగా ఉంటుందని,తింటే అంత రుచిగా ఉండదని అనుకుంటారు. కానీ సరిగ్గా వండితే ఇతర కర్రీల కంటే కాకర కాయ రుచి అద్భుతంగా ఉంటుంది. అంతేకాకుండా చేదుగా ఉండే కాకరకాయలో ఎన్నో పోషక గుణాలు ఉంటాయని డాక్టర్లు చెబుతుంటారు. కాకరకాయ ఉల్లి కారం ఒక్కసారి తిన్నారంటే ఆ టేస్ట్ జన్మలో మర్చిపోరు. వేడి అన్నం,పప్పు చారు,రసం ఇలా దేనితోనైనా తింటే చాలా రుచిగా ఉంటుంది. కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం చూడండి.

**కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు**

కాకరకాయ
ఉల్లిపాయ
నూనె
ఉప్పు
పసుపు
కారం
జీలకర్ర
వెల్లుల్లి



ముందుగా 400 గ్రాముల లేత కాకరకాయలను తీసుకొని వాటిపైన చెక్కు తీసుకోండి. తర్వాత కాకరకాయ తల, తోక కట్ చేసి కాకరకాయని రెండు ఇంచు ముక్కలుగా కట్ చేసి ఓ బౌల్ లో వేసుకోండి. ఇప్పుడు కాకరకాయ ముక్కలలో 1 టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ఉప్పు వేసి బాగా పట్టించి అరగంట సేపు పక్కన ఉంచండి.

అరగంట తర్వాత కాకరకాయల్లో నుంచి నీరు అంతా దిగుతుంది. అప్పుడు ఒక్కో కాకరకాయను బాగా చేతులోకి తీసుకొని పిండితే అందులోని మిగిలిన చేదు కూడా పోతుంది. అలా పిండిన తర్వాత ఆ ముక్కలను పక్కన ఓ ప్లేట్ లో పెట్టుకోండి. ఇప్పుడు మిక్సీ జార్ లో పెద్దగా కట్ చేసిన పావు కిలో ఉల్లిపాయలు,8 వెల్లుల్లి రెబ్బలు,1 టీస్పూన్ జీలకర్ర, 2 టేబుల్ స్పూన్ల కారం,కొంచెం ఉప్పు వేసి మెత్తని పేస్ట్ లా చేసుకోండి. తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి పావు కప్పు ఆయిల్ పోసి అది కొంచెం వేడయ్యాక అందులో కాకరకాయ ముక్కలను వేసి 56 నిమిషాలు వేపుకోండి. తర్వాత కాకరకాయ ముక్కలను ఓ ప్లేట్ లోకి తీసుకొని వాటిల్లోని గింజలను తీసేసి మిక్సీలో వేసి చేసుకున్న మిశ్రమాన్ని కాకరకాయ ముక్కల్లో స్టఫ్ గా చేసుకోండి. ఇప్పుడు కాకరకాయలు వేపుకున్న నూనెలోనే మరో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి అందులో స్టఫ్ చేసుకున్న కాకరకాయ ముక్కలను వేయండి. మిగిలిన ఉల్లిపాయ పేస్ట్ ని కూడా అందులో వేసి మీడియం ఫ్లేమ్ మీద 20 నిమిషాలు వేపుకోవాలి.

దింపే ముందు కొంచెం కరివేపాకు చల్లుకోండి. అంతే కరివేపాకు ఉల్లిపాయ కారం రెడీ.



# కలబందను ఎలా వాడాలి?



కలబంద ఆరోగ్యానికి మాత్రమే కాదు.. అందానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని ఉపయోగించి ఎన్నో చర్మ సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకే దీని జెల్ ను డైరెక్ట్ గా ముఖానికి పెట్టేస్తుంటారు. కానీ కలబంద జెల్ ను తీసి అలాగే ముఖానికి పెడితే ఏమౌతుందో తెలుసా? కలబంద జెల్ లో ఎన్నో ఔషద లక్షణాలుంటాయి. ఇది మనకు కెమికల్స్ లాగా ఎలాంటి హాని చేయడదు. అయినప్పటికీ.. దీన్ని డైరెక్ట్ గా అంటే కలబంద గుజ్జును తీసి ముఖానికి పెట్టుకుంటే కొన్ని సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుందని నిపుణఉలు చెబుతున్నారు.

కలబంద జెల్ లో మన శరీరానికి, చర్మానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ ఈ జెల్ ను అలాగే ముఖానికి పెట్టుకోవడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

కలబంద జెల్ లో టీ ట్రీ ఆయిల్ తో పాటుగా కొన్ని సహజ పదార్థాలను కలపకుండా ముడి కలబందను ముఖానికి ఉపయోగిస్తే కొన్ని చర్మ సమస్యలు వస్తాయి. ఇది చర్మ రకం, సున్నితత్వం మీద ఆధారపడి ఉంటుంది.


కొంతమందికి ముడి కలబందను ఉపయోగించడం వల్ల ఎలాంటి సమస్యలు రాకపోవచ్చు. కానీ కొంతమందికి అలెర్జీ, దద్దుర్లు, దురద, చర్మం ఎర్రబడటం వంటి సమస్యలు వస్తాయి.

నిజమేంటంటే? కలబంద ప్రతి చర్మ రకానికి సరిపోదు. కాబట్టి దీన్ని ఉపయోగించే ముందు ఇది పడుతుందా? లేదా? అని చెక్ చేసుకోవాలి. నేషనల్ సెంటర్ ఫర్ కాంప్లిమెంటరీ అండ్ ఇంటిగ్రేటివ్ హెల్త్ ప్రకారం.. చర్మానికి లోతైన కోతలు లేదా గాయాలు ఉంటే మాత్రం మీరు ఎట్టిపరిస్థితిలో కలబంద జెల్ ను ఉపయోగించకూడదు. ఎందుకంటే కలబంద జెల్ శస్త్రచికిత్సకు సంబంధించిన లోతైన గాయాలు నయం కావడానికి మీ చర్మ సహజ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. పలు నివేదికల ప్రకారం.. కలబంద జెల్ ను పెట్టుకునేటప్పుడు కొంతమందికి మంట, దురద వంటి సమస్యలు వచ్చాయి.

ఒకవేళ దీనివల్ల దద్దుర్లు అయితే మాత్రం వెంటనే దీన్ని పెట్టడం ఆపేయాలి. అలాగే చర్మ అంటువ్యాధులు ఉంటే కూడా కలబంద జెల్ ను పెట్టుకోకూడదు. ఎందుకంటే ఇది అంటువ్యాధులను మరింత పెంచుతుంది.



# మంచంపై కూర్చొని తింటున్నారా? ఈ ఇబ్బందులు తప్పవు..!



మంచం మీద కూర్చొని భోజనం చేయకూడదని ఇంట్లో పెద్దలు చెప్పడం మనం చాలాసార్లు వినే ఉంటాము. పెద్దలు ఎప్పుడూ నేలపై కూర్చొని తినమని సలహా ఇస్తారు. అయితే దీని వెనుక వారి వాదన ఏమిటంటే.. మంచం మీద కూర్చొని తినడం వల్ల లక్ష్మీ దేవిని అవమానిస్తున్నట్లు అని, ఆలా చేయడం ద్వారా ఆమెకు కోపం వస్తుందని చెబుతుంటారు.

ఇది మతపరమైన కారణం. కానీ, శాస్త్రీయ దృక్కోణంలో కూడా మీ ఈ అలవాటు సరైనది కాదు. సుఖం కోసం మీరు కూడా మంచం మీద హాయిగా కూర్చొని తినడం ఆనందిస్తే, ఈ అలవాటు మీ ఆరోగ్యానికి చాలా హానికరం కలిగిస్తుంది. నిజానికి మనం ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? అనేది కూడా చాలా ముఖ్యం. కాబట్టి, మీరు మంచం మీద కూర్చొని ఆహారం ఎందుకు తినకూడదో ఒకసారి చూద్దాం..

**జీర్ణక్రియపై చెడు ప్రభావం:**

నేలపై కూర్చునే భంగిమ కంటే బెడ్‌లోని భంగిమ రిలాక్సింగ్‌గా మారుతుంది. భోజనం చేసేటప్పుడు రెండు భంగిమలు మీ జీర్ణక్రియకు మంచివి కావు. ఇది మీ జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

కొన్నిసార్లు ఇది కడుపులో భారం, యాసిడ్ రిఫ్లక్స్ కు కారణమవుతుంది. ఈ నేపథ్యంలో మంచం మీద కూర్చొని ఆహారం తినాల్సి వస్తే నిటారుగా కూర్చొని సరైన భంగిమలో తినడానికి ప్రయత్నించండి.

**నిద్ర ప్రభావితం**

ప్రతిరోజూ బెడ్‌పై ఆహారం తీసుకోవడం కూడా మన నిద్రపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇలా చేయడంవల్ల మన శరీరం ఒక నిర్దిష్ట స్థలాన్ని, దానికి సంబంధించిన కార్యకలాపాలను బాగా గుర్తిస్తుంది. పడక ఎప్పుడూ నిద్రతో ముడిపడి ఉన్నట్లే, స్టడీ టేబుల్ ఎప్పుడూ చదువులతో ముడిపడి ఉంటుంది. కానీ, మీరు మంచం మీద పడుకునే బదులు ఆహారం తిన్నప్పుడు అది మీ మనస్సుకు కొంచెం గందరగోళంగా అనిపించవచ్చు. ప్రతిరోజూ ఇలా చేయడం వల్ల, మీరు కొన్నిసార్లు మంచం మీద పడుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**వేగంగా ఊబకాయం**

మంచం మీద భోజనం చేయడం వల్ల మీ బరువు వేగంగా పెరుగుతుంది. దీని వెనుక చాలా ఆసక్తికరమైన మానసిక కారణం ఉంది. నిజానికి మీరు రిలాక్స్డ్ మూడ్‌లో బెడ్‌పై కూర్చొని ఆహారం తిన్నప్పుడు, సాధారణంగా టీవీ లేదా మొబైల్‌లో వినోదం కూడా దానితో పాటు కొనసాగుతూనే ఉంటుంది. అలా హాయిగా తిండి తిన్నప్పుడు చాలా సార్లు రెండు పూటలా ఆకలితో కాస్త ఎక్కువగానే తినేస్తాం. రోజువారీ ఈ చిన్న అదనపు కేలరీలు మీ బరువు పెరగడానికి కారణమవుతాయి.

**అలెర్జీల సంక్రమణ ప్రమాదం**

మంచం మీద కూర్చొని ఆహారం తినేటపుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని ఆహారపు రేణువులు బెడ్ పైనే ఉండిపోతాయి. ఈ చిన్న కణాలు చాలా రోజులు బెడ్ లేదా బెడ్ షీట్స్ లో ఉంటాయి. కొన్నిసార్లు ఆహార కణాల కారణంగా బొద్దింకలు, చీమలు మంచంలోకి వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందుతుందనే భయం పెరుగుతుంది.





# విశ్వంభరునికి పవన్ శుభాకాంక్షలు

విశ్వంభరునికి జన్మదిన శుభాకాంక్షలు అంటూ పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో ఒక లేఖ విడుదల చేశారు రేపు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఇప్పటినుంచే ఫ్యాన్స్ సెలబ్రేషన్స్ మొదలుపెట్టారు ఈ నేపథ్యంలో తన సోదరుడికి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు చెబుతూ లేక విడుదల చేశారు. చిరంజీవిగా ప్రేక్షక లోకాన్ని రంజింపచేసి ధ్రువతారగా వెలుగొందుతున్న మా అన్నయ్య చిరంజీవి గారికి ప్రేమపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయన తమ్ముడిగా పుట్టడం ఒక అదృష్టమైతే ఆయన కష్టాన్ని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరగడం ఒక గొప్ప అనుభవం... వెల కట్టలేని జీవిత పాఠం.

ఒక సాదాసీదా సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చిరంజీవి గారు ఒక అసాధారణ వ్యక్తిగా విజయాలు సాధించి ఎల్లలు దాటి కీర్తిప్రతిష్టలు సాధించడం నాకే కాదు నాలాంటి ఎందరికో స్ఫూర్తి ప్రదాత. చిరంజీవి గారు కీర్తికి పొంగిపోలేదు.. కువిమర్శలకు కుంగిపోనూ లేదు. విజయాన్ని వినమ్రతతో.. అపజయాన్ని సవాలుగా స్వీకరించే పట్టుదల ఆయన నుంచే నేను నేర్చుకున్నాను. అన్నిటిని భరించే శక్తి ఆయన నైజం. అందుకే ఆయన 'విశ్వంభరుడు'..! పితృ సమానుడైన అన్నయ్యకు, మాతృ సమానురాలైన వదినకు ఆ భగవంతుడు సంపూర్ణ ఆయుష్షుతో కూడిన ఆరోగ్య సంపదను ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు.



# అందుకే సినిమాలు తగ్గించాను: సమంత

నటిగానే కాకుండా నిర్మాతగానూ సరికొత్త కథలను ప్రేక్షకులకు అందిస్తూ అగ్ర కథానాయిక సమంత ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ఈ బ్యూటీ ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన విషయం తెలిసిందే. ఆ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమని సమంత చెప్పారు. 15 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటోన్న ఆమె ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ''గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో ఎంతో మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఫిట్‌నెస్, సినిమాలు రెండిటిపైనా దృష్టిపెట్టాను. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే'' ''తక్కువ ప్రాజెక్ట్‌లు చేయాలని నిర్ణయించుకున్నా. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ, తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్ట్‌ల సంఖ్య తగ్గింది.. కానీ, వాటి నాణ్యత కచ్చితంగా పెరుగుతుంది'' అని చెప్పారు. ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సమంత అందులో వచ్చే ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించగలగాలని తెలిపారు. ''నేను సామాజిక మాధ్యమాల్లో సాధ్యమైనంత వరకు వాస్తవంగా ఉండడానికి ప్రయత్నిస్తాను. కామెంట్స్‌లో వచ్చే ప్రశంసలకు ఎలా ఆనందిస్తామో.. ట్రోలింగ్, నెగెటివ్ కామెంట్స్‌ను కూడా అంతే హుందాగా స్వీకరించగలగాలి. మీరు దాన్ని కంట్రోల్ చేయగలగాలి కానీ, అది మీ జీవితాన్ని పూర్తిగా నియంత్రించకూడదు'' అని తెలిపారు. ప్రస్తుతం సమంత 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్'లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, సమంతతో పాటు అలీ ఫజల్ కీలకపాత్రలో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.



## సినీ పరిశ్రమలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రెజీనా కసాండ్రా

అందం, అభినయం కలగలిసిన తార రెజీనా కసాండ్రా.. శివ మనసులో శృతి చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన ఈ భామ ఆ తరువాత రొటీన్ లవ్‌స్టోరీ, కొత్తజంట, పిల్ల నువ్వులేని జీవితం, సుబ్రమణ్యం ఫర్ సేల్ చిత్రంతో తెలుగులో అగ్ర కథానాయికల జాబితాలో చేరింది. కేవల తెలుగులోనే కాకుండా తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా నాయికగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ.

ఇటీవల అజిత్‌లో కలిసి నటించిన తమిళ చిత్రం విదా మయూర్చితో పాటు బాలీవుడ్ చిత్రం జాట్‌తో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు రెజీనా కసాండ్రా. ఇప్పటి వరకు అన్ని తరహా పాత్రలను పోషించిన ఈ అందాల భామ త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులతో ముందుకు రానుంది. భారతీయ సినీ పరిశ్రమలో ప్రవేశించి 20 ఏళ్లు పూర్తిచేసుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగులో ఓ రెండు చిత్రాలతో పాటు తమిళంలో మూడు సినిమాలు, కన్నడ, హిందీ భాషల్లో రెండు చిత్రాలతో బిజీగా ఉంది



# స్టేజిపైనే కన్నీళ్లు పెట్టుకున్న టీవీకే చీఫ్ విజయ్

- భారీగా బహిరంగ సభ
- లక్షలాదిగా వచ్చిన జనాలు
- స్టేజిమీదే ఏడ్చేసిన హీరో

టీవీకే పార్టీ చీఫ్ విజయ్ ఎమోషనల్ అయ్యాడు. స్టేజి మీదే అందరి ముందు ఏడ్చేశాడు. విజయ్ పెట్టిన పార్టీ టీవీకే. పార్టీని అనౌన్స్ చేసే కార్యక్రమం తర్వాత మళ్లీ ఇన్ని రోజులకు నేడు మధురలో మానాడు కార్యక్రమం నిర్వహించారు. భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో తనకోసం వచ్చిన లక్షల మందిని చూసి విజయ్ ఉప్పొంగిపోయారు. ఆయన ఎక్స్‌ప్రెషన్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయిపోయాయి. పార్టీ జెండాను ఆవిష్కరించే క్రమంలో ఆయన లక్షలాది మంది జనాలను చూసి చాలా ఎమోషనల్ అయిపోయారు.

ఆయన కన్నీళ్లు పెట్టుకున్న వీడియో ఇప్పుడు ట్రెండింగ్ లోకి వచ్చేసింది. ఈ సభలో చాలా ఎమోషనల్ గా మాట్లాడారు విజయ్. తనకు బీజేపీతోనే శత్రుత్వం ఉందన్నారు. బీజేపీతో ఎట్టి పరిస్థితుల్లో చేతులు కలిపేది లేదన్నారు. డీఎంతో పోరాడుతామన్నారు. ఆ పార్టీని గద్దె దించుతానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని.. కచ్చితంగా అధికారంలోకి వస్తామన్నారు. తమిళనాడులో సింహం వేట మొదలైందన్నారు. తనకు మతం, కులం ముఖ్యం కాదని.. తమిళనాడుకే తన మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు టీవీకే చీఫ్ విజయ్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999